మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 24-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 356 Issue: 356

24 జూన్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:47 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి దశమి సా. 6:15 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం చిత్తా మ. 1:55 వరకు తరువాత స్వాతి యోగం పరిఘ ఉ. 10:17 వరకు కరణం గరజి సా. 6:15 వరకు వనిజ ఉ. 7:07o వరకు వర్జ్యం రా. 8:10 నుండి రా. 9:56 వరకు దుర్ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:44 వరకు రాహుకాలం మ. 12:18 నుండి మ. 1:56 వరకు యమగండం ఉ. 7:25 నుండి ఉ. 9:02 వరకు గుళికాకాలం ఉ. 10:40 నుండి మ. 12:18 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:11 నుండి తె. 4:59 వరకు అమృత ఘడియలు ఉ. 7:32 నుండి ఉ. 9:17 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial





## 11 నౌకలు వచ్చేస్తున్నాయ్!

### హర్మూజ్‌ను దాటినట్లు కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికా– ఇరాన్‌లు శాంతి ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత హర్మూజ్ జలసంధిలో పరిస్థితులు మెరుగుపడుతోందని, ఈ క్రమంలో భారత్ జెండాలున్న 11 నౌకలు హర్మూజ్‌ను దాటినట్లు భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. పశ్చిమాసియాలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని, జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా చమురు దిగుమతి చేసుకుంటామన్నారు. 'ఇప్పటివరకు భారత జెండాలున్న పది నౌకలు తరువాయి 2 వ పేజీలో...




## 'ఈ20'పై ప్రచారం అబద్ధం: కేంద్రం

న్యూఢిల్లీ దేశవ్యాప్తంగా సరఫరా అవుతున్న ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్‌పై సోషల్ మీడియా వేదికగా సాగుతున్న తప్పుడు ప్రచారాలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఇథనాల్ ఇంధనంపై ప్రజలను గందరగోళానికి గురిచేసేలా, తప్పుదోవ పట్టించేలా కొన్ని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నట్లుగా వార్తలు వచ్చాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

సోషల్ మీడియాలో ఫ్యాన్స్‌ను పెంచుకోవడం కోసం, లేని సంచనాలను సృష్టించడం కోసం కొందరు పాత చిత్రాలు, వీడియోలను సర్క్యులేట్ చేస్తున్నారని కేంద్ర పేర్కొంది. ఇథనాల్ బ్లెండెడ్ ఇంధనంపై కొందరు ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని.. వాటిని నమ్మవద్దని కేంద్రం స్పష్టం చేసింది. ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ అనేది పూర్తిగా శాస్త్రీయంగా నిరూపితమైందని, తరువాయి 2 వ పేజీలో...

# చినుకమ్మా.. నీ అలకేల?

జూన్ మూడో వారం ముగింపుకు చేరుకున్నా తెలంగాణలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉంది. ఖరీఫ్ సీజన్‌కు కీలకమైన ఈ సమయంలో చినుకులు పడకపోవడంతో దుక్కులు సిద్ధం చేసిన రైతులు విత్తనాలు వేయలేక ఎదురుచూస్తున్నారు.

నైరుతి రుతుపవనాల మందగమనం..
ఎండలతో ఎండిపోతున్న పొలాలు..
చేతిలో విత్తనాలతో రైతన్న ఎదురుచూపులు..
తెలంగాణలో వర్షాభావం..!
అన్నదాతకు తీరని శోకం..!!

### అసలే జాడలేని వానలు.. ముగిసిన జూన్ మూడో వారం.. ఆకాశం వైపు ఆశగా రైతన్న



ఎండల తీవ్రత, నీటి కొరత, పెరుగుతున్న సాగు ఖర్చులు రైతన్నను అనిశ్చితిలోకి నెట్టాయి. సాధారణంగా జూన్ నెలలో నైరుతి రుతుపవనాలు చురుకుగా మారి రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవాలి. కానీ ఈసారి వాతావరణ పరిస్థితులు ఆశించినంతగా అనుకూలించకపోవడంతో అనేక ప్రాంతాల్లో వర్షపాతం లోటు కనిపిస్తోంది. గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు ఆకాశాన్ని గమనిస్తూ మేఘాలు కమ్ముకుంటాయేమోనని ఎదురుచూస్తున్నారు. కొన్ని -2 వ పేజీలో...



## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు?

### కేంద్ర సర్వీసుల నుంచి రిలీవ్

### తెలంగాణ కేడర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 23 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు బాధ్యతలు చేపట్టే అవకాశాలున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర సీఎస్‌గా సేవలందిస్తున్న కే రామకృష్ణా రావు పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. కొత్త సీఎస్ ఎంపికపై గత కొన్ని రోజులుగా జోరుగా మంతనాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసుల్లో కొనసాగుతున్న సంజయ్ జాజును తిరిగి సొంత తరువాయి 2 వ పేజీలో...

# త్వరలో కేంద్ర కేబినెట్ విస్తరణ?

### తాజాగా రాష్ట్రపతితో ప్రధాని మోదీ భేటీ.. మారుతున్న రాజకీయ పరిణామాలు

కేంద్ర కేబినెట్ విస్తరణ త్వరలోనే జరిగే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు మరింత బలపడుతున్నాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో భేటీ కావడం, అంతకుముందే కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్ తన పదవికి రాజీనామా చేయడం ఈ చర్చలకు ఊతమిచ్చాయి.

న్యూఢిల్లీ: 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం అనంతరం రాష్ట్రపతితో మోదీ భేటీ కావడంతో.. కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై జాతీయ స్థాయిలో చర్చలు జోరందుకున్నాయి. కేరళకు చెందిన బీజేపీ నేత జార్జ్ కురియన్ కేంద్ర సహాయ మంత్రి పదవికి రాజీనామా చేయగా, రాష్ట్రపతి ఆ రాజీనామాను ఆమోదించారు. దీంతో ఖాళీ ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇటీవల పలువురు కేంద్ర మంత్రులకు వారి వారి రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలు అప్పగించడం కూడా ఈ ప్రచారానికి బలం చేకూరుస్తోంది. ముఖ్యంగా కేంద్ర రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాను ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా నియమించడం, ఎన్నికలు ఎదుర్కొనున్న రాష్ట్రాల్లో మరికొందరు మంత్రులకు పార్టీ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయన్న వార్తలు చర్చనీయాంశంగా మారాయి. ఈ తరువాయి 2 వ పేజీలో...



## పేరు చెప్తే రూ. లక్ష!

### తెలంగాణలో కొత్త పథకం

### పేరు సూచించాలన్న సర్కారు

### నచ్చితే బహుమతిగా రూ.లక్ష

హైదరాబాద్, జూన్ 23 (ఈవార్తలు): హైదరాబాద్ నగర కేంద్ర ప్రాంతం, దాని చుట్టుపక్కల వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలను ఒకే అభివృద్ధి, పరిపాలనా పరిధిగా పరిగణించేందుకు తెలంగాణ ప్రభుత్వం క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)గా విభజించిన సంగతి తెలిసిందే. సాధారణంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధి లోపల ఉండే ప్రాంతమే ఈ క్యూర్. అయితే ఈ క్యూర్‌లో లక్ష ఇళ్లను నిర్మించాలని తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఈ కొత్త పథకానికి ఒక మంచి పేరు పెట్టేందుకు కసరత్తు చేస్తోంది. ఇలాంటి సమయంలోనే అధికారులకు ఒక వినూత్న ఐడియా వచ్చింది. ఈ పథకానికి తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,137 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,248 |



# మెట్రో-2 పట్టాలకు లైన్ క్లియర్

### విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్.. క్యాప్స్ కన్సల్టెంట్‌గా ఎస్టీఐ

గత కొన్ని రోజులుగా హైదరాబాద్ మెట్రో తొలి దశ స్వాధీనం, రెండో దశ మెట్రో విస్తరణకు సంబంధించి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం, బీజేపీ నేతల మధ్య తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ కీలక పరిమాణం చోటు చేసుకుంది. తాజాగా ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. పలువురు కేంద్రమంత్రులతో సమావేశమై చర్చించారు.

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 23 (ఈవార్తలు): ఈ క్రమంలోనే హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు సంబంధించి.. కేంద్రమంత్రులతో జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. ఎల్ అండ్ టీ సంస్థ వద్ద నుంచి హైదరాబాద్ మెట్రోను స్వాధీనం చేసుకోవడంతోపాటు సెకండ్ ఫేజ్ విస్తరణకు కూడా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. సోమవారం రోజున తరువాయి 2 వ పేజీలో...

# పట్టాలెక్కాలంటే కేసీఆర్ రావాల్సిందే

### ఎయిర్‌పోర్టు మెట్రో రద్దు రేవంత్ తుగ్లక్ నిర్ణయం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



'రేవంత్ రెడ్డి ఎజెండా ఎప్పుడు ఒక్కటే ఉంటది. మెట్రో భూముల ఆయన ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కాం మాత్రం పక్కా ఉంటది. ఆయన కన్ను అంతా మెట్రో భూముల మీద పడ్డది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. లంకె బిందెల కోసం తిరుగుతా ఉన్నడు. మెట్రో దగ్గర 280 ఎకరాల విలువైన భూములున్నాయి.

హైదరాబాద్, జూన్ 23 (ఈవార్తలు): సుమారు రూ.30 వేల కోట్ల విలువ చేసే భూములు. ఆయన అన్నదమ్ములకో, బావమరి దులతో, అల్లుడికో కట్టబెట్టేందుకే ఆ 280 ఎకరాల విలువైన భూములపై కన్నేసిండు కాబట్టే ఇవాళ ఆ మెట్రోను స్వాధీనం చేసుకుని.. 14 వేల కోట్ల భారం ప్రజల మీద రుద్ది ఆ భూము లను అమ్ముకొని తనకు కావాల్సిన వాళ్లకు కట్టబెట్టే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి ఉన్నడని మండిపడ్డారు. చూడండి రాబోయే రోజుల్లో ఎవరికి అమ్ముతాడు.. ఎవరు కొంటారు. ఎట్లా అమ్ముతాడో చూస్తారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం బ్రహ్మాండంగా 72 కిలోమీటర్ల తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



సాధారణంగా పర్యావరణాన్ని పరిరక్షించిన వారిని ప్రశంసిస్తారు. కానీ బ్రిటన్‌లోని తూర్పు లండన్‌లో ఒక నదిని శుభ్రం చేసిన పర్యావరణ కార్యకర్త ఇప్పుడు జైలు శిక్షను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. యూకేకు చెందిన న్యాయవాది, పర్యావరణ కార్యకర్త పాల్ పౌల్స్‌ల్యాండ్ స్వచ్ఛంద సేవకులతో కలిసి తీవ్ర కాలుష్యానికి గురైన రోడింగ్ నది నుంచి 200కుపైగా చెత్త సంచులను తొలగించారు. ఈ సేవా కార్యక్రమానికి అధికారిక అనుమతులు తీసుకోలేదన్న కారణంతో ఎన్విరాన్‌మెంట్ ఏజెన్సీ పాల్ పౌల్స్‌ల్యాండ్‌పై విచారణ చేపట్టింది.

# ఆబ్కారీ సారు.. పెద్ద లంచగొండి!

### 8 ప్లాట్లు, 10 ఎకరాల భూమి.. 4 ఇళ్లు, రూ.50 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్

### ఎక్సైజ్ సూపరింటెండెంట్ అవినీతి ఆస్తులు



నిజామాబాద్, జూన్ 23 (ఈవార్తలు): నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డి ఏసీబీ వలకు చిక్కాడు. కొమ్మూరి మల్లారెడ్డికి ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. నిజామాబాద్, హైదరాబాద్‌లలో మంగళవారం ఉదయం నుంచి సోదాలు చేపట్టారు. నిజామాబాద్‌లోని ప్రగతి నగర్‌లో ఉన్న మల్లారెడ్డి అద్దె ఇంటితోపాటు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆఫీస్.. హైదరాబాద్ మచ్చ బొల్లారంలో ఉన్న ఇల్లు, ఆయన బంధువుల ఇళ్లపై మొత్తంగా 11 ప్రాంతాల్లో ఒకేసారి 11 మంది టీమ్‌లు దాడులు నిర్వహించాయి. ఉదయం నుంచి లెక్కలు తీసిన ఏసీబీ అధికారులు.. భారీగా ఆయనకు తరువాయి 2 వ పేజీలో...

# పోలీస్ సారు.. చిన్న లంచగొండి!

### స్టేషన్ బెయిల్ కోసం రూ.50 వేలు లంచం



హైదరాబాద్, జూన్ 23 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని గాంధీనగర్ ఎస్సై వీ నరసింహులు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. మంగళవారం సాయంత్రం ఓ బాధితుడి నుంచి రూ.50 వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఒక కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చి భవిష్యత్‌లో తనపై ఎలాంటి వేధింపులకు గురి చేయవద్దని కోరుతూ ఓ వ్యక్తి ఎస్సైని సంప్రదించగా రూ. లక్ష డిమాండ్ చేశాడు. దీంతో సదరు వ్యక్తి హైదరాబాద్ సిటీ రేంజ్ 1 ఏసీబీని ఆశ్రయించడంతో ఏసీబీ అధికారులు వల వేశారు. ముందుగా రూ.50 వేలు -2 వ పేజీలో...




## సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిలో 122 పోస్టులు

### ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ

### వచ్చే నెల 6న చివరి తేదీ

హైదరాబాద్, జూన్ 23 (ఈవార్తలు): హైదరాబాద్‌లో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ క్రమంలోనే సనత్ నగర్ టిమ్స్ ఆస్పత్రి ఇటీవల ప్రారంభం తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు
24.6.2026

మేషం: చేపట్టిన పనులు అంతంత మాత్రంగా సాగుతాయి. సంతాన విద్యా ఉద్యోగ విషయాలు నిరాశ కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. మాతృ వర్గీయులతో మాటపట్టింపులు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి.

వృషభం: ఉద్యోగ వాతావరణం సంతృప్తికరంగా ఉంటుంది. బంధుమిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. అన్ని రంగాల వారికి ఆదాయం బాగుంటుంది. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. సోదరులతో వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలు అనుకూలిస్తాయి. నూతన వాహన యోగం ఉన్నది.

మిధునం: ధన విషయమై ఇతరులకు తొందరపడి మాట ఇవ్వడం మంచిది కాదు. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసికంగా స్థిరత్వం ఉండదు. వృత్తి వ్యాపారాలలో సరైన నిర్ణయాలు తీసుకోలేరు. ఆధ్యాత్మిక,సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన ఋణయత్నాలు కలసిరావు.

కర్కాటకం: ఆర్థిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారు. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో కీలక ఆలోచనలు అమలు చేస్తారు. ఉద్యోగమున హోదాలు పెరుగుతాయి.

సింహం: వృత్తి వ్యాపారాలలో మీ కష్టానికి తగిన ఫలితం ఉండదు. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇంటా బయట కొంతమంది ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు.

కన్య: కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులు సకాలంలో పూర్తి అవుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు ఉన్నప్పటికి నిదానంగా పూర్తిచేస్తారు. ఆర్థిక పరమైన సమస్యల నుండి ఉపశమనం పొందుతారు. నూతన కార్యక్రమాలు కార్యరూపం దాల్చుతాయి. వ్యాపారాలలో విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి.

తుల: ఉద్యోగాలలో నూతన అవకాశాలు లభిస్తాయి. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన పనులలో అవరోధాలు అధిగమించి ముందుకు సాగుతారు. ఆర్థిక పరమైన ఇబ్బందులను అధిగమించి పాత ఋణాలు తీర్చగలుగుతారు.

వృశ్చికం: సంతాన విషయాలకు సంబంధించి కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. కుటుంబ సభ్యులతో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నిర్ణయాలు కలసి వస్తాయి. వ్యాపారాలు అనుకూలిస్తాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనస్సు: ఇతరులపై మీ అభిప్రాయం మార్చుకోవడం మంచిది. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తికావు. ఇంటా బయట చికాకులు పెరుగుతాయి. శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. బంధు మిత్రులతో మాటపట్టింపులుంటాయి. వృత్తి ఉద్యోగాలలో మీ కష్టం వృధాగా మిగులుతుంది.

మకరం: గృహమున బంధుమిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ధనపరంగా చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. దూర ప్రయాణ సూచనలున్నవి. వృత్తి వ్యాపారాలలో నూతన లాభాలు అందుకుంటారు.

కుంభం: ముఖ్యమైన వ్యవహారాలలో కుటుంబ పెద్దల సలహాలను తీసుకొని ముందుకు సాగడం మంచిది. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుకుంటారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చేపట్టిన పనులలో ఆటంకాలు కలిగినా నిదానంగా పూర్తిచేస్తారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

మీనం: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఆర్థిక విషయాలలో తొందరపడి ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ప్రారంభించిన పనులు కొంత నిదానంగా పూర్తి చేస్తారు. సహోద్యోగుల ప్రవర్తన వలన మానసిక ఇబ్బందులు తప్పవు. వాహన ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది.



# మెట్రో-2 పట్టాలకు లైన్ క్లియర్

మొదటి పేజీ తరువాయి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి.. మంగళవారం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశం అయ్యారు. ఉదయం నుంచి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలోనే సుదీర్ఘంగా చర్చించారు. హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్ విస్తరణ, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) రుణం, తెలంగాణలో పలు కీలక ప్రాజెక్టులపై చర్చలు జరిపారు. మెట్రో ఫేజ్ -1 వాల్యుయేషన్, ఫేజ్ -2 విస్తరణకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎస్బీఐ క్యాప్స్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తుందని ఈ సమావేశంలో కేంద్రమంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ ఎస్బీఐ క్యాప్స్ కన్సల్టెంట్ ఇచ్చే రిపోర్ట్ ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కన్సల్టెంట్‌లో సమన్వయ సభ్యులుగా కేంద్ర ప్రభుత్వ అధికారితోపాటు.. రాష్ట్ర పట్టణ వ్యవహారాల శాఖ స్పెషల్ సెక్రటరీ ఉంటారు. మెట్రో ఫేజ్-1 ఆస్తుల విలువ ఎంత.. దాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎలా టేకోవర్ చేసుకోవాలి.. ఫేజ్-2 విస్తరణకు ఐఆర్ఎఫ్‌సీ నుంచి తక్కువ వడ్డీకే రుణాన్ని ఎలా పొందాలి.. అనే విషయాలపై ఎస్బీఐ క్యాప్స్ సమగ్రంగా రిపోర్టును అందించనుంది. ఈ రిపోర్టు ఆధారంగానే కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ తదుపరి నిధుల విడుదలకు ఆమోదం తెలపనుంది. ఈ చర్చల్లో భాగంగానే తెలంగాణ సర్కార్.. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన రెండో దశ మెట్రో విస్తరణ ప్రణాళికలో భాగంగా దాదాపు 70 కిలోమీటర్ల పైగా కొత్త మార్గాలను ప్రతిపాదించినట్లు సమాచారం.

## త్వరలో కేంద్ర కేబినెట్ విస్తరణ?

మొదటి పేజీ తరువాయి

పరిణామాల నేపథ్యంలో కొందరు ప్రస్తుత మంత్రులు పదవులకు రాజీనామా చేసి పార్టీ పనుల్లో నిమగ్నమయ్యే అవకాశం ఉందని, అదే సమయంలో కొత్త ముఖాలకు కేంద్ర కేబినెట్‌లో చోటు కల్పించే అవకాశాలను బీజేపీ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. వివిధ పార్టీల నుంచి ఇటీవల బీజేపీ లేదా ఎన్డీయేలో చేరిన నేతలకు కూడా మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉందని జాతీయ మీడియా కథనాలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ-రాష్ట్రపతి భేటీని పరిశీలకులు కేబినెట్ విస్తరణకు ముందు జరిగే కీలక రాజకీయ సంప్రదింపులలో భాగంగా చూస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

## 11 నౌకలు వచ్చేస్తున్నాయ్!

ఇంకా పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయి. అదనంగా మరో రెండు నౌకలు ఇటీవలే అక్కడకు చేరుకున్నాయి. అమెరికా-ఇరాన్ ఒప్పందం జరిగినప్పటి నుంచి 11 భారతీయ నౌకలు హర్మూజ్‌ను దాటాయి. ఒక్కోదాంట్లో 2.85లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉన్న మూడు భారత జెండాలున్న నౌకలు, విదేశీ జెండా ఉన్న ఓ ఎల్‌పీజీ నౌక, విదేశీ జెండా ఉన్న మరో ముడి చమురు ట్యాంకర్, ఆరు విదేశీ జెండాలున్న ఎరువులు సరఫరా చేస్తున్న భారీ నౌకలు ఉన్నాయి. మిగిలిన భారత జెండాలున్న నౌకలు త్వరలోనే జలసంధిని దాటుతాయని అంచనా వేస్తున్నాం' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. ఇరాన్ నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుందా? అన్న ప్రశ్నకు జయస్వాల్ బదులిస్తూ.. 140 కోట్ల పౌరులకు తక్కువ ధరలో ఇంధనం అందించడమే ప్రభుత్వ విధానమని చెప్పారు. అయితే, రష్యా చమురు కొనుగోలుపై అమెరికా విధించిన ఆంక్షల గడువు వారం క్రితం ముగియడం.. ఇరాన్ సంస్థల నుంచి కొనుగోలు చేసేందుకు భారతీయ కంపెనీలకు అవకాశం లభించినట్లయ్యిందన్నారు.

## పోలీస్ సారు.. చిన్న లంచగొండి!

మొదటి పేజీ తరువాయి

ఇవ్వాలని చెప్పి పంపారు. లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది.

## 'ఈ20'పై ప్రచారం అబద్ధం: కేంద్రం

మొదటి పేజీ తరువాయి

దీనిపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని సంబంధిత మంత్రిత్వ శాఖ తెలిపింది. కాగా, 2003లోనే ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు కేంద్రం గుర్తుచేసింది. ఆటోమొబైల్ సాంకేతిక సన్నద్ధత, సంబంధిత వర్గాల సంప్రదింపుల ఆధారంగా దశలవారీగా అమలు చేస్తూ.. 2023 నుంచి దేశవ్యాప్తంగా 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ ఇంధన సరఫరాను విజయవంతంగా అందుబాటులోకి తెచ్చినట్లుగా పేర్కొన్నారు. ఈ విషయంలో వాహనదారులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

## ఆబ్కారీ సారు.. పెద్ద లంచగొండి!

మొదటి పేజీ తరువాయి

అక్రమాస్తులు ఉన్నట్లు గుర్తించారు. కొమ్మూరి మల్లారెడ్డికి 4 ఇళ్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు తేల్చారు. ఒక వాణిజ్య భవనంతోపాటు.. 8 ఖాళీ ప్లాట్లు.. 10.23 ఎకరాల వ్యవసాయ భూమి కూడా ఆయనకు ఉన్నట్లు గుర్తించారు. ఇక మల్లారెడ్డి వద్ద సుమారు రూ.3.31 లక్షల నగదు దొరకగా.. బ్యాంక్ డిపాజిట్ల కింద మరో రూ.50 లక్షలు ఉన్నట్లు వెల్లడైంది. మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై 3 బ్యాంకు లాకర్లు ఉన్నాయని ఏసీబీ తనిఖీల్లో తేలింది. ఇక కొమ్మూరి మల్లారెడ్డిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు ఆయనను నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఈ అక్రమాస్తుల విచారణలో భాగంగా మల్లారెడ్డి, అతడి కుటుంబ సభ్యుల పేర్ల మీద ఉన్న బ్యాంకు లాకర్లను త్వరలోనే తెరవనున్నారు.

## పట్టాలెక్కాలంటే కేసీఆర్ రావాల్సిందే

మొదటి పేజీ తరువాయి

మెట్రో కట్టింది. మెట్రోకు మొత్తం టెండర్ ప్రక్రియ పూర్తి చేసిందన్నారు కేటీఆర్. రాయదుర్గం మీ శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి ఎయిర్‌పోర్ట్ దాకా పోతూ మధ్యలో రాజేంద్రనగర్ దగ్గర 3 స్టాపులు పెట్టి పట్ట ణం పెరుగుతున్నది.. ఇక్కడికెళ్లి అక్కడిదాకా ట్రాఫిక్ పెరుగుతుంది. మరి ఆ ట్రాఫిక్ సమస్య ఉండొద్దని చెప్పి 2023 జూన్-జూలై ప్రాంతంలో టెండర్ పూర్తి చేసి మొత్తం మెట్రో రెడీగా కొబ్బరికాయలుకొట్టి మొదలుపెట్టినం. సీఎం రేవంత్ రెడ్డి రాగానే తీసుకున్న తుగ్లక్ నిర్ణయం ఎయిర్ పోర్ట్ మెట్రో రద్దు. ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎందుకు రద్దు చేస్తున్నవ్ నాయనా అంటే చెప్పడని కేటీఆర్ ఫైర్ అయ్యారు. 'ఆ ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికే పూర్తయిపోతుండే. రెండేళ్లలోనే పూర్తికావాలని షరతు పెట్టినం. అందులో లాండ్ అక్విజిషన్ కూడా లేదు. భూసేకరణ సమస్య కూడా లేదు. ఔటర్ రింగ్ రోడ్డును అంటుకొని బ్రహ్మాండంగా ఎయిర్‌పోర్ట్ దాకా మధ్యలో బుద్వేల్, నార్సింగిలో స్టాపులు పెట్టి ట్రాఫిక్ సమస్య తగ్గాలే.. హైదరాబాద్ పెరగాలె.. అనే ఉద్దేశంతో మనమొక నిర్ణయం తీసుకున్నామ'న్నారు. రెండున్నర ఏండ్లు అయిపోయిన తర్వాత ఇప్పుడు కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారు.

## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు?

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రానికి పంపాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని మన్నించిన కేంద్ర ప్రభుత్వం.. ఆయనను తెలంగాణకు పంపుతూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పరిపాలనపై సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయన్ను.. సీఎస్ స్థానంలో నియమించేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం సంజయ్ జాజు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో తాజా పరిణామాలు, పరిపాలనాపరమైన అంశాలపై వీరిద్దరి మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం.

## పేరు చెప్తే రూ. లక్ష!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రజల నుంచి పేరును సేకరించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే పేర్ల కోసం ప్రజల నుంచి సూచనలు ఆహ్వానం పలుకుతోంది. ఈ పథకానికి సరిగ్గా సరిపోయే పేరును సూచించిన వారికి లక్ష రూపాయల బహుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించింది. పేరును సూచించేందుకు ఈనెల 28వ తేదీ చివరి తేదీ అని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గౌతమ్ వెల్లడించారు. తెలంగాణ హౌసింగ్ శాఖకు సంబంధించిన 'టీజీహెచ్‌డీ.అఫీషియల్' పేరుతో ఉన్న ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా ఈ పోటీలో పాల్గొని పేరును సూచించవచ్చని తెలిపారు. దీనికి సంబంధించి సోషల్ మీడియా వేదికగా పోటీని పెట్టినట్లు వీసీ గౌతం ఒక ప్రకటన ద్వారా వెలువరించారు. క్యూర్ పరిధిలో తక్కువ ఆదాయం ఉన్న ప్రజల కోసం ప్రత్యేకంగా లక్ష ఇళ్లను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఎలాంటి వివాదాలు లేకుండా.. అందుబాటు ధరల్లో ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చడంలో హౌసింగ్ బోర్డుకు మంచి రికార్డ్ ఉంది. ఇక క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎల్ఐజీ ప్లాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గౌతమ్ తెలిపారు. వాటికి అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించినట్లు పేర్కొన్నారు. అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించి.. లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయిస్తామని, త్వరలోనే విధివిధానాలను చెప్పారు.

## సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిలో 122 పోస్టులు

మొదటి పేజీ తరువాయి

కాగా.. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. టిమ్స్ ఆస్పత్రి పరిపాలన, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ భర్తీ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం నిమ్స్ ఆస్పత్రికి అప్పగించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే టిమ్స్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నిమ్స్ ఆస్పత్రి తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. కాంట్రాక్ట్, తాత్కాలిక ప్రాతిపదికన ఒక ఏడాది కాలపరిమితికి గాను టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్, సపోర్ట్ సర్వీసెస్ విభాగాల్లో మొత్తంగా 122 ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. టిమ్స్ ఆస్పత్రిలో రెగ్యులర్ నియామకాలు పూర్తయ్యేలోపు.. అక్కడి ప్రజలకు తక్షణమే వైద్య సేవలను అందుబాటులోకి తీసువచ్చేందుకు తాత్కాలిక ఏర్పాట్లలో భాగంగా ఈ నియామకాలను చేపట్టనున్నారు. తాజా నోటిఫికేషన్‌లో టెక్నికల్ విభాగాలకు సంబంధించి ఎక్కువ పోస్టులు ఉన్నాయి. మొత్తం 122 పోస్టుల్లో టెక్నీషియన్ పోస్టులు 98 ఉండటం గమనార్హం. వీటిలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 విభాగంలో అత్యధికంగా 34 ఖాళీలు ఉన్నాయి. అనస్థీషియా టెక్నీషియన్ విభాగంలో 20 పోస్టులు.. ఎక్స్ రే లేదా సీ ఆర్మ్ టెక్నీషియన్ గ్రేడ్-2 విభాగంలో 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవి మాత్రమే కాకుండా ఈసీజీ టెక్నీషియన్, క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్ విభాగాల్లో 6 చొప్పున ఖాళీలను భర్తీ చేయనున్నారు. అదే సమయంలో బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ గ్రేడ్-2, సీటీ టెక్నీషియన్ గ్రేడ్-2, ఎంఆర్ఐ టెక్నీషియన్, సీఎస్ఎస్‌డీ టెక్నీషియన్ విభాగాల్లో 4 చొప్పున ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇవే కాకుండా ఈఈజీ టెక్నీషియన్ గ్రేడ్-2, బయోమెడికల్ టెక్నీషియన్ విభాగాల్లో 2 చొప్పున పోస్టులు ఉన్నాయి. ఇక ఆడియోమెట్రీ, ఆడియో విజువల్ టెక్నీషియన్ విభాగాల్లో ఒక్కో పోస్టు చొప్పున భర్తీ చేసేందుకు నిమ్స్ ఆస్పత్రి ప్రకటన విడుదల చేసింది. అదే సమయంలో సనత్ నగర్ టిమ్స్ హాస్పిటల్.. మరో 24 అడ్మినిస్ట్రేటివ్ పోస్టులను కూడా ఈ నోటిఫికేషన్‌లోనే భర్తీ చేయనున్నారు. ఇందులో సీనియర్ అసిస్టెంట్ విభాగంలో 5 ఖాళీలు.. సూపర్‌వైజర్ 4, హెల్త్ ఇన్‌స్పెక్టర్ 4 చొప్పున ఖాళీలు ఉన్నాయి. అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, డిప్యూటీ రిజిస్ట్రార్ లేదా డిప్యూటీ ఫైనాన్షియల్ కంట్రోలర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ లేదా అసిస్టెంట్ ఫైనాన్షియల్ కంట్రోలర్, అకౌంటెంట్ విభాగాల్లో 2 చొప్పున పోస్టులను భర్తీ చేయనున్నారు.

# చినుకమ్మ.. నీ అలకేల?

మొదటి పేజీ తరువాయి

చోట్ల మబ్బులు కనిపించినా వాన మాత్రం కురవకపోవడం నిరాశకు గురిచేస్తోంది.

### విత్తనాలు సిద్ధం.. కానీ చల్లే పరిస్థితి లేదు

ఖరీఫ్ సాగు కోసం పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, కంది తదితర పంటల విత్తనాలను ఇప్పటికే కొనుగోలు చేసిన రైతులు వర్షాల కోసం వేచి చూస్తున్నారు. తగినంత తేమ లేకుండా విత్తనాలు చల్లితే మొలక శాతం తగ్గే ప్రమాదం ఉండటంతో చాలామంది సాగును వాయిదా వేస్తున్నారు. ఒకవేళ తొందరపడి విత్తిన తర్వాత మళ్లీ వర్షాలు ఆగిపోతే పంట పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందనే భయం వెంటాడుతోంది. ఎండల కారణంగా పొలాల్లో తేమ పూర్తిగా తగ్గిపోతోంది. చెరువులు, కుంటలు నిండకపోవడం వల్ల సాగునీటి వనరులపై కూడా ప్రభావం పడుతోంది. భూగర్భ జలాలపై ఆధారపడే రైతులు బోర్ల నిర్వహణకు అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోంది. విద్యుత్, డీజిల్, ఎరువులు, కూలీల ఖర్చులు ఇప్పటికే పెరిగిన తరుణంలో వర్షాభావం రైతుల ఆర్థిక భారాన్ని మరింత పెంచుతోంది.

సాగు చక్రం దెబ్బతినే ప్రమాదం

ఖరీఫ్ సీజన్‌లో సరైన సమయంలో విత్తనాలు వేయకపోతే మొత్తం పంట కాలపట్టిక మారిపోతుంది. ఆలస్యంగా సాగు ప్రారంభమైతే దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పంటల పెరుగుదల దశలో వాతావరణం అనుకూలించకపోతే రైతులు నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం పడే అవకాశముంది. వర్షాలు ఆలస్యమవడం కేవలం రైతుల సమస్య మాత్రమే కాదు. వ్యవసాయ కూలీలు, విత్తనాలు-ఎరువుల వ్యాపారులు, రవాణా రంగం, వ్యవసాయ ఆధారిత చిన్న పరిశ్రమలు కూడా దీని ప్రభావాన్ని ఎదుర్కొంటాయి. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు తగ్గి ఆర్థిక కార్యకలాపాలు మందగించే పరిస్థితి ఏర్పడుతుంది.



### ప్రత్యామ్నాయమే ప్రణాళిక

వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖలు రైతులకు తగిన సూచనలు అందించడం అవసరం.

తక్కువ కాలంలో పండే పంటలు, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, నేలలో తేమను నిల్వ చేసే పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అలాగే విత్తనాల లభ్యత, పంట బీమా, సాగు సలహాలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం కనిపిస్తోంది.



## బాసర అమ్మవారి కిరీటం, హుండీ చోరీ

**సీసీటీవీ ఫుటేజ్‌లో ఇద్దరు ముసుగు దొంగలు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

బాసర, జూన్ 23 (ఈవార్తలు): తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణంలో భారీ చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయ సముదాయంలోని మహాకాళి అమ్మవారి ఆలయంలోకి చొరబడి, వెండి కిరీటంతో పాటు హుండీని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి రావడంతో భక్తులు, అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మంగళవారం ఉదయం నిత్య పూజల కోసం వచ్చిన అర్చకులు ఆలయ ద్వారాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆలయ ప్రాంగణంలోని పై అంతస్తులో ఉన్న మహాకాళి అమ్మవారి ఆలయం గేటును పగలగొట్టిన దొంగలు, సుమారు 1.5 కిలోల బరువున్న వెండి కిరీటాన్ని అపహరించారు. అనంతరం హుండీని పగలగొట్టి అందులోని నగదును దోచుకుని, ఖాళీ హుండీని సమీపంలోనే పడేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిళ, స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆలయాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, ఇద్దరు ముసుగు ధరించిన వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించినట్లు గుర్తించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పోలీసులు ఆధారాలను సేకరిస్తున్నారు. గోదావరి నది తీరాన కొలువుదీరిన ఈ ఆలయాన్ని భక్తులు 'దక్షిణ గంగ'గా పిలుచుకుంటారు. కురుక్షేత్ర యుద్ధం ముగిసిన అనంతరం వేదవ్యాస మహర్షి ఇక్కడ సరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి విగ్రహాలను ప్రతిష్ఠించారని పురాణ గాథలు చెబుతున్నాయి. ఇటీవల ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 225 కోట్లతో ఆలయ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేసిన తరుణంలో, ఈ భారీ చోరీ జరగడం భద్రతా వైఫల్యాలపై పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో ఆలయంలో భక్తుల కానుకల లెక్కింపు ప్రక్రియను అధికారులు తాత్కాలికంగా వాయిదా వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని వెల్లడించారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా కోయిలకుంట్ల శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలోనూ హుండీ చోరీ జరగడం గమనార్హం.

# రేవంత్ దేవుడినే మోసం చేశాడు

**ప్రజలను మోసం చేయడా?:**

**రామయ్యపై ఒట్టిపెట్టి మాట తప్పాడు**

**మాజీమంత్రి హరీశ్ రావు విసుర్లు**



కొత్తగూడెం, జూన్ 23 (ఈవార్తలు): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు, సీఆర్ నమోదు అవగాహన సదస్సుకు మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పాల్గొన్న పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశ్వారావుపేటలో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఇంత జోష్ ఉంటుందని అనుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లోని అచ్చంపేటకు వెళ్లినా, అశ్వారావుపేటకు వచ్చినా "మళ్లీ కేసీఆర్ రావాలి" అనే ఒకటే మాట వింటున్నానని చెప్పారు. మార్పు రావాలని, మాటలు చెప్పేవారు కాదు, చేతలు చూపే కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ ఎన్నికల ముందు హామీ ఇవ్వకపోయినా ప్రజలకు అవసరమైన ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని తెలిపారు. మేనిఫెస్టోలో లేకపోయినా, ఓట్ల కోసం చెప్పకపోయినా కల్యాణలక్ష్మి వంటి గొప్ప పథకాన్ని అమలు చేసి 13 లక్షల మంది పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు రూ.13 వేల కోట్లు వెచ్చించారని గుర్తుచేశారు. ఎన్నికల హామీలో లేని రైతుబంధును కూడా అమలు చేశామని, కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా రైతుబంధు ఆపకుండా 11 విడతల్లో రూ.73 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానికి వెళ్లిన వారికి కేసీఆర్ కిట్‌తో పాటు రూ.12 వేల ఆర్థిక సహాయం అందించి తల్లి, బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. అలాగే మిషన్ భగీరథ వంటి అనేక పథకాలను ఎన్నికల హామీలతో సంబంధం లేకుండా అమలు చేశారని చెప్పారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చిందని, కేసీఆర్ రూ.10 వేలు ఇస్తానంటే తాము రూ.15 వేలు ఇస్తామని, కేసీఆర్ పెళ్లికి లక్ష రూపాయలు ఇస్తే తులం బంగారం కూడా జోడిస్తామని చెప్పారని, కానీ అవన్నీ హామీలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. రూ.2 లక్షలకుపైగా రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీల వీడియోలను ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. దీనిపై స్పందిస్తూ... సీఎం మాట నమ్మి వడ్డీలకు అప్పు తెచ్చి రుణాలు చెల్లించిన రైతులు ఇప్పుడు వడ్డీలపై వడ్డీలు కడుతున్నారని, కానీ రుణమాఫీ మాత్రం జరగలేదన్నారు. భూమి బద్దలైనా, అటు సూర్యుడు ఇటు పొడిచినా రుణమాఫీ చేస్తాం అని చెప్పి ఇప్పుడు మాట తప్పారని ఆరోపించారు. భద్రాద్రి శ్రీరాముడిపై ఒట్టు పెట్టి మాట తప్పిన రేవంత్ రెడ్డిని ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. "దేవుడినే మోసం చేసినవాడు ప్రజలను మోసం చేయడా? దేవుడిపైనా భయం లేకుండా పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. ప్రజలు దీనిని గమనించాలి" అని అన్నారు. ఈ నెల 30న మధిరలో రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నారని, యాసంగి రైతుబంధు ఎగ్గొట్టి ఇప్పుడు వానాకాలం రైతుబంధు ఇస్తామని చెబుతారని అన్నారు. ఎకరానికి ఇస్తారా, రెండు ఎకరాల వారికి ఇస్తారా అనేది కూడా స్పష్టత లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రైతులు సీఎం రేవంత్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరుతున్నారని, కానీ రైతులు ఎందుకు ఆశీర్వదించాలని ప్రశ్నించారు. దేవుడి పై ఒట్టు పెట్టి మాట తప్పినందుకా? మూడుసార్లు రైతుబంధు ఇవ్వకుండా రూ.29 వేల కోట్లు బకాయి పెట్టినందుకా.. అసెంబ్లీ సాక్షిగా పంటల బీమా ఇస్తామని చెప్పి అమలు చేయనందుకా.. మొక్కజొన్న, మిర్చి, పామాయిల్ రైతులకు అవసరమైనంత యూరియా ఇవ్వకపోయినందుకా రైతులు ఆశీర్వదించాలని ప్రశ్నించారు. వడ్ల కొనుగోలులో తరుగుతీస్తే తోలు తీస్తానన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు రైస్ మిల్లర్ల చేతిలో తోలుబొమ్మగా మారిపోయారని విమర్శించారు. మధిరలో నిర్వహించే రైతు ఆశీర్వాద సభను రైతు క్షమాపణ సభగా పేరు మార్చాలని, రైతు డిక్లరేషన్ పేరుతో చేసిన మోసానికి, నెరవేర్చని హామీలకు రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రులు చేసింది గుండు సున్న.. సీతారామ ప్రాజెక్టును 80 శాతం పూర్తి చేసి వదిలేశామని, మిగిలిన 20 శాతం పూర్తి చేసే సామర్థ్యం ఈ ప్రభుత్వానికి లేదన్నారు. ప్రాజెక్టును పూర్తిగా అటకెక్కించారని ఆరోపించారు. గేట్లు సకాలంలో ఎత్తకపోవడంతో ప్రభుత్వ నిర్లక్ష్యం, మానవ తప్పిదం కారణంగా అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టు కొట్టుకుపోయిందన్నారు. వేల ఎకరాలు నష్టపోతుంటే రెండేళ్లుగా ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా ప్రారంభించిన ప్రాజెక్టు ఒక్కటీ లేదన్నారు. ఖమ్మం జిల్లాలో పెదవాగు ప్రాజెక్టు కొట్టుకుపోయిందని, మహబూబ్‌నగర్ జిల్లా వట్టెం పంప్ హౌస్ మునిగిపోయిందని, ఎస్ఎల్బీసీ టన్నెల్ కూలి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారని, సుంకిశాల ప్రాజెక్టు కూలిపోయినా ఇప్పటికీ పునర్నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




## ఏటీఎంకు తెచ్చిన రూ.17 లక్షలు మాయం!

**బైక్‌పై వచ్చి నగదు ట్రంకును ఎత్తుకెళ్లిన దుండగులు**

**వ్యాన్ డ్రైవర్ పరారీ.. కుమ్మక్కుపై పోలీసుల అనుమానం**

హైదరాబాద్, జూన్ 23 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్ ప్రాంతంలో పట్టపగలే భారీ చోరీ చోటుచేసుకుంది. ఏటీఎంలో నింపేందుకు తీసుకువచ్చిన సుమారు రూ.17 లక్షల నగదును దుండగులు అపహరించారు. ఈ ఘటన జరిగిన వెంటనే క్యాష్ వ్యాన్ డ్రైవర్ కూడా కనిపించకుండా పోవడంతో, ఇది తెలిసిన వారి పనేనని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఓ క్యాష్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీకి చెందిన సిబ్బంది ఏటీఎంలో నగదు నింపేందుకు వ్యాన్‌లో అక్కడికి చేరుకున్నారు. సిబ్బంది ఏటీఎం కియోస్క్‌లోకి వెళ్లిన సమయంలో, ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి వ్యాన్‌లో ఉన్న నగదు పెట్టెను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే డ్రైవర్ కూడా పరారీ కావడంతో, అతడు దొంగలతో కుమ్మక్కై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రధానంగా డ్రైవర్ పాత్రపైనే దృష్టి సారించి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో పట్టపగలే ఈ తరహా చోరీ జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.



## హిమాయత్ సాగర్‌కు వరద ప్రవాహం

హైదరాబాద్, జూన్ 23 (ఈవార్తలు): క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా హిమాయత్ సాగర్ జలాశయంలో నీటి మట్టం మంగళవారం తెల్లవారుజాము నుంచి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుత పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తున్న అధికారులు, అవసరమైతే పరిస్థితులకు అనుగుణంగా జలాశయం నుంచి వరద నీటిని విడుదల చేసే అవకాశం ఉందని జలమండలి అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖలు, విపత్తు నిర్వహణ విభాగాలు, స్థానిక సంస్థలు, అలాగే జలాశయాల దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి విజ్ఞప్తి చేసింది. జలాశయాల గేట్ల నిర్వహణ, నీటి విడుదల (డిశ్చార్జ్) లేదా ఇతర అత్యవసర చర్యలకు సంబంధించి ఏవైనా నిర్ణయాలు తీసుకున్న వెంటనే అధికారిక ప్రకటనల ద్వారా ప్రజలకు, మీడియాకు సమాచారం అందజేయబడుతుందని జలమండలి స్పష్టం చేసింది. ఈ సందర్భంగా జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ, జంట జలాశయాల పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సంబంధిత విభాగాలు పరస్పర సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. జలాశయాల దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలు పరిస్థితిని గమనిస్తూ అధికారుల సూచనలను పాటించాలని, అవసరమైతే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

## సాక్ష్యాలు మాయం: రోజా

విజయవాడ, జూన్ 23 (ఈవార్తలు): విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సీసీటీవీ ఫుటేజీ మాయం కావడం సాయికృష్ణ అదృశ్యం కేసును మరింత సంచలనాత్మకం చేసింది. వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా ఈ అంశంపై తీవ్ర ఆరోపణలు చేశారు. "సాయికృష్ణ అదృశ్యంపై మొదటి నుంచి అనేక అనుమానాలు ఉన్నాయి. ఇప్పుడు కీలక సాక్ష్యాలైన సీసీటీవీ ఫుటేజీ మాయం కావడం ఆందోళన కలిగిస్తోంది" అని అన్నారు. సాక్ష్యాలను భద్రపరచాల్సిన పోలీసులే వాటిని కాపాడలేకపోతే ప్రజలు ఎవరిని నమ్మాలి? సీసీటీవీ ఫుటేజీ మాయం కావడంపై ఎందుకు క్రిమినల్ కేసు నమోదు చేయడం లేదు? ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంపై ఎందుకు స్పందించడం లేదు? అని రోజా ప్రశ్నించారు. మరోవైపు, సాయికృష్ణను పోలీసులు చిత్రహింసలకు గురిచేసి లాకప్ డెత్ చేశారని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సీఐ నాగరాజును సస్పెండ్ చేసి సిట్ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో, సీఐను సిట్ కార్యాలయానికి తరలిస్తుండగా అతని మద్దతుదారులు ఆందోళన చేపట్టి అడ్డుకోవడానికి ప్రయత్నించారు. సాయికృష్ణ కేసు గత వారం రోజులుగా ఏపీలో హాట్ టాపిక్‌గా మారింది.



## టార్గెట్‌కు మించి కొంటున్నం

**దాంతో రాష్ట్రంలో 16 వేల కోట్ల భారం**

**కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో ఉత్తమ్**

న్యూఢిల్లీ: రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం విధించిన టార్గెట్‌ను మించి వరి కొనుగోలు తెలంగాణ ప్రభుత్వం చేపడుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత మూడు సీజన్లలో 69.50 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు వరి కొనుగోలు చేశామని, దీంతో రాష్ట్రంపై రూ.16,446 కోట్ల ఎంఎస్పీ భారం పడిందన్నారు. ఎండలు, హమాలీల కొరత, నిల్వ సమస్యలు, అకాల వర్షాల మధ్య కూడా సేకరించామని, రైతులకు ఎలాంటి నష్టం లేకుండా ప్రతి గింజను కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. మంగళవారం ఢిల్లీకి వెళ్లిన ఆయన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ధాన్యం సేకరణపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన పేర్కొంటూ రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో జరిగిన వరి కొనుగోళ్లతో కేంద్రం నిర్దేశించిన సేకరణ, సీఎంఆర్ సరఫరా గడువులను పొడిగించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి కనీస మద్దతు ధరకు ఒక్క గింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేసినట్లు తెలిపారు. దేశంలోనే అత్యధికంగా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించిందని, కొనుగోలు ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఖరీఫ్, రబీ కలిపి 2025-26 మార్కెటింగ్ సీజన్‌లో 152 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా వరి సేకరణ జరిగి చారిత్రాత్మక రికార్డు నమోదైంది. రాష్ట్రం పంపిన ఉత్పత్తి అంచనాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వరి సేకరణ లక్ష్యాలను తక్కువగా నిర్ధారించడంతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందన్నారు. రబీలో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ అంచనాలు సమర్పించినప్పటికీ, కేంద్రం కేవలం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (51.47 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానం) మాత్రమే లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. రబీ 5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, ఖరీఫ్ 2025-26కు సంబంధించి 14.24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేంద్ర పూల్‌కు సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. నిల్వ స్థలాల కొరత, ఒకేసారి పలు సీజన్ల కొనుగోళ్లు కొనసాగడం, మిల్లింగ్ సామర్థ్యాలపై ఒత్తిడి వంటి కారణాలతో గడువులు పొడిగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రబీ 2024-25 సీఎంఆర్ సరఫరా గడువును మరో 60 రోజులు, ఖరీఫ్ 2025-26 గడువును 120 రోజులు పొడిగించాలని కోరారు.



## హైదరాబాద్‌లో 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'

**ప్రారంభించిన యూఎస్ రాయబారి, భట్టి**

హైదరాబాద్, జూన్ 23 (ఈవార్తలు): హైదరాబాద్ మరో అంతర్జాతీయ మైలురాయికి వేదికైంది. అమెరికా దేశ 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను (ఫ్రీడమ్ 250) పురస్కరించుకుని నగరంలో ఘనంగా గాలా రిసెప్షన్ నిర్వహించారు. ఈ చారిత్రాత్మక వేడుకలో భాగంగా గచ్చిబౌలిలోని అమెరికన్ కాన్సులేట్ పక్కనే ఉన్న రహదారిని 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన అధికారిక ఫలకాన్ని ఆవిష్కరించారు. భారత్‌లో యూఎస్ రాయబారి సెర్గియో గోర్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంయుక్తంగా ఈ ప్లాక్‌ను ఆవిష్కరించి, ఇరు దేశాల బంధాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లారు. ఈ వేడుకకు పలువురు సీనియర్ దౌత్యవేత్తలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, వ్యాపార, ఏరోస్పేస్, రక్షణ, సాంకేతిక రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. అమెరికా జాతీయ ఆర్థిక, భద్రతా ప్రాధాన్యతలతో పాటు పారిశ్రామిక రంగంలో తెలంగాణ లీడర్‌షిప్‌ను ఈ సందర్భంగా కొనియాడారు. అమెరికా రాయబారి సెర్గియో గోర్, యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌తో కలిసి ఇరు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ భాగస్వామ్యాన్ని వేడుకగా జరుపుకున్నారు. హైదరాబాద్ వేదికగా అమెరికా-భారత్ సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయనడానికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' నామకరణమే నిదర్శనమని నేతలు అభిప్రాయపడ్డారు.

## కృష్ణలంక సీఐ నాగరాజు అరెస్టు

**గాదె సాయికృష్ణ కేసులో కీలక పరిణామం**

విజయవాడ, జూన్ 23 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ (25) అదృశ్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), సస్పెన్షన్‌కు గురైన కృష్ణలంక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్వీవీ నాగరాజును అదుపులోకి తీసుకుంది. గత మే 9న కృష్ణలంక పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారని, ఆ తర్వాత అతను కనిపించకుండా పోయాడని బాధితుడి తల్లి విజయలక్ష్మి ఆరోపించారు. పోలీసులు తన కుమారుడిని చిత్రహింసలకు గురిచేసి చంపేసి, మృతదేహాన్ని మాయం చేశారని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, సీఐ నాగరాజును సస్పెండ్ చేయడంతో పాటు సమగ్ర విచారణ కోసం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో, సీఐ నాగరాజుపై హత్య, అక్రమ నిర్బంధం వంటి అభియోగాలతో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మంగళవారం సిట్ అధికారులు విజయవాడ సింగ్ నగర్‌లోని నాగరాజు నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన మద్దతుదారులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి, నాగరాజును విచారణ నిమిత్తం సిట్ కార్యాలయానికి తరలించారు. అక్కడ సుమారు ఐదు గంటల పాటు సుదీర్ఘంగా విచారించిన అనంతరం ఆయనను అరెస్టు చేశారు. నాగరాజు అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని సిట్ అధికారులు ఆయన కుటుంబ సభ్యులకు అందించారు.

# జూలై 5 నుంచి అన్నాహజారే నిరాహార దీక్ష

## ఆర్టీఐ నిబంధనల సవరణ రద్దు చేయాల్సిందే.. మహా సర్కారుకు అల్టిమేటం



ముంబై: మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన సమాచార హక్కు (ఆర్టీఐ) నిబంధనల సవరణలను వెంటనే రద్దు చేయాలని సామాజిక కార్యకర్త అన్నా హజారే డిమాండ్ చేశారు. లేదంటే జులై 5 నుంచి అహ్మద్‌నగర్ జిల్లా రాలేగాన్ సిద్ధిలోని యాదవ్‌బాబా ఆలయం వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాసిన హజారే.. జూన్ 12న తీసుకొచ్చిన మహారాష్ట్ర ఆర్టీఐ రూల్స్--2026, సమాచార హక్కు చట్టం స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కొత్త నిబంధనల వల్ల ఆర్టీఐ చట్టం లక్ష్యం నీరుగారి, ప్రజలకు సమాచారం అందడం మరింత కష్టమవుతుందని విమర్శించారు. ఆర్టీఐ దరఖాస్తుల ఫీజులను పెంచడాన్నీ హజారే తీవ్రంగా వ్యతిరేకించారు. 20 ఏళ్ల తర్వాత ఫీజులు పెంచితే, సమాచారం ఇవ్వకుండా ఆలస్యం చేసే అధికారులపై విధించే జరిమానాలను కూడా పెంచాలని సూచించారు. దరఖాస్తుదారులు గుర్తింపు పత్రాలు సమర్పించాల్సిన నిబంధన కూడా చట్టానికి విరుద్ధమని అన్నారు. ఇది సమాచారాన్ని కోరేవారి భద్రతకు ముప్పుగా మారుతుందని చెప్పారు. 'ఒక దరఖాస్తులో ఒకే అంశం' అనే నిబంధన అనవసర భారమని, ఒకే అంశంపై మళ్లీ దరఖాస్తు చేస్తే దాన్ని తిరస్కరించే అవకాశం కల్పించడం వల్ల పూర్తి సమాచారం పొందే హక్కు దెబ్బతింటుందని హజారే అభిప్రాయపడ్డారు. ప్రజలకు స్వయంగా సమాచారం అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యాలను సరిచేయకుండా, భారం మొత్తం ప్రజలపైనే మోపుతున్నారని విమర్శించారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఈ సవరణలను అమలు చేశారని ఆరోపించిన హజారే.. ప్రభుత్వం వెంటనే వాటిని ఉపసంహరించుకోకపోతే ప్రాణాలు పోయినా జులై 5 నుంచి దీక్ష ప్రారంభిస్తానని స్పష్టం చేశారు.



# స్కాంట్లాండ్‌లో సుశ్రుతుడి విగ్రహం ఏర్పాటు

**రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జియన్స్ ఆఫ్ ఎడిన్‌బర్గ్‌లో ఏర్పాటు**

న్యూఢిల్లీ: ఆధునిక వైద్యశాస్త్రం ఇంకా అభివృద్ధి చెందని కాలంలోనే భారతీయ వైద్యుడు సుశ్రుతుడు విశేష కృషి చేశాడు. 2,600 ఏళ్ల క్రితమే 1,120 వ్యాధులను నమోదు చేశాడు. 700కు పైగా ఔషధ మొక్కలు, 300కుపైగా వైద్య విధానాలు, 120 శస్త్రచికిత్స పరికరాల వివరాలను లిఖితపూర్వకంగా భద్రపరిచాడు. ఇప్పుడు ఆయనకు స్కాట్లాండ్‌లో అరుదైన గౌరవం దక్కింది. స్కాట్లాండ్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జియన్స్ ఆఫ్ ఎడిన్‌బర్గ్ సుశ్రుతుడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించింది. శస్త్రచికిత్స రంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యంత పురాతన శస్త్రవైద్య కళాశాలగా గుర్తింపు పొందిన ఈ సంస్థ సుశ్రుతుడిని 'ప్లాస్టిక్ సర్జరీ పితామహుడు'గా పేర్కొంది. 90 కిలోల బరువున్న ఈ విగ్రహాన్ని తమిళనాడులోని సంప్రదాయ శిల్పకారులు రూపొందించారు. సుశ్రుతుడు రచించిన 'సుశ్రుత సంహిత' ప్రపంచంలోని ప్రాచీన వైద్య గ్రంథాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇందులో శస్త్రచికిత్స, శిశు వైద్యం, మానసిక ఆరోగ్యం, కంటి ముక్కు చెవి వ్యాధుల వంటి అనేక అంశాలపై వివరాలు ఉన్నాయి. 300కుపైగా శస్త్రచికిత్స విధానాలు, 120కు పైగా పరికరాల వినియోగాన్ని ఇందులో వివరించారు. మధుమేహం, స్థూలకాయం, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించిన లక్షణాలను కూడా సుశ్రుతుడు ప్రస్తావించినట్లు పరిశోధకులు చెబుతున్నారు. వ్యాయామం, జీవనశైలి ఆరోగ్యంపై చూపే ప్రభావాన్ని కూడా వివరించారు. శతాబ్దాల క్రితం ఆయన అందించిన వైద్య విజ్ఞానం ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అధ్యయనానికి కేంద్రబిందువుగా నిలుస్తోంది. ఎడిన్‌బర్గ్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం భారత ప్రాచీన జ్ఞాన సంపదకు లభిస్తున్న అంతర్జాతీయ గుర్తింపును మరోసారి చాటిచెప్పింది.

# కేంద్ర మంత్రి పదవికి జార్జి కురియన్ రాజీనామా



న్యూఢిల్లీ: కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజ్యసభ సభ్యత్వ పదవీ కాలం ముగియడం, ఈసారి బీజేపీ అధిష్ఠానం ఆయనను తిరిగి నామినేట్ చేయకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జార్జి కురియన్ సమర్పించిన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి భవన్ వర్గాలు ధ్రువీకరించాయి. ఇప్పటివరకు మోదీ క్యాబినెట్‌లో ఆయన మైనార్టీ వ్యవహారాల శాఖతో పాటు.. మత్స్య, పాడి, పశుపోషణ శాఖలకు కూడా సహాయ మంత్రి హోదాలో బాధ్యతలు నిర్వహించారు. జార్జి కురియన్ రాజ్యసభ ఎంపీ పదవీ కాలం గత ఆదివారం అంటే జూన్ 21న ముగిసింది. భారత రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. పార్లమెంట్‌లో (లోక్‌సభ లేదా రాజ్యసభ) సభ్యుడిగా లేని వ్యక్తి గరిష్ఠంగా 6 నెలలు మాత్రమే మంత్రిగా కొనసాగే ఛాన్స్ ఉంటుంది. అయితే ఈసారి బీజేపీ ఆయనను తిరిగి రాజ్యసభకు పంపేందుకు మొగ్గు చూపకపోవడంతో, ఆయన తన పదవిని వదులుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఉన్న కేంద్ర మంత్రివర్గంలో ఏకైక క్రిస్టియన్ మంత్రి జార్జి కురియన్ మాత్రమే కావడం గమనార్హం. కేరళలో క్రైస్తవ ఓటు బ్యాంక్‌ను ఆకట్టుకునే క్రమంలో బీజేపీ ఆయనకు ఈ కీలక బాధ్యతలు అప్పగించింది.

# అమర్‌నాథ్ యాత్రికులకు ఇన్సూరెన్స్ పెంపు



న్యూఢిల్లీ: పరమశివుడి భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అమర్‌నాథ్ యాత్ర 2026కు సర్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్‌లోని ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తోంది. జూలై 3న ఈ యాత్ర ప్రారంభమై, ఆగష్టు 28న ముగియనుంది. ఈ సందర్భంగా యాత్రికులకు, పర్యాటకులకు, అక్కడి సాధారణ ప్రజలకు కూడా స్థానిక అధికారులు ట్రాఫిక్ సహా, ఆరోగ్యం వంటి అంశాల్లో కొన్ని సూచనలు చేశారు. ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రికులు ఈ సూచనలను తప్పకుండా తెలుసుకోవాలి. యాత్రికుల రక్షణ, భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ ఎక్కువగా ఉండే కొన్ని మార్గాల్లో నిర్దిష్ట సమయం వరకు భక్తులను అనుమతించబోరు. నవయుగ టన్నెల్‌ను మూసేస్తారు. కాశ్మీర్ నుంచి జమ్మూ వచ్చే వాహనాలను ఉదయం 11.30 గంటల వరకు అనుమతించారు. అలాగే, జమ్మూ నుంచి కాశ్మీర్ వెళ్లే వాహనాలను మధ్యాహ్నం 3.00 తర్వాత అనుమతించరు. అలాగే, మరికొన్ని రూట్లలో కూడా నిర్దిష్ట సమయాల్లో ట్రాఫిక్ ఆపేయడం చేస్తారు. బల్తాల్, పహల్గాం మార్గాల్లో వెళ్లే ప్రయాణికుల భద్రత కోసం వసతి, భద్రత, ఆహారం, వైద్య సదుపాయాల్ని ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న యాత్రికులకు శ్రీ అమర్‌నాథ్‌జీ దేవస్థాన బోర్డు ఇన్సూరెన్స్ కవరేజ్‌ను పెంచింది. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రీమియం లేదా ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ చేసుకున్న యాత్రికులతోపాటు దేవస్థాన సిబ్బంది, అక్కడ పని చేసే కార్మికులు, అధికారులకు ఉచితంగానే వర్తిస్తుంది. యాత్ర మార్గంలో రెండు ప్రత్యేక ఆస్పత్రుల్ని ఏర్పాటు చేశారు. పూర్తి సామగ్రితో ఇవి పని చేస్తాయి. ఇందులో 70 వరకు బెడ్లు, 100 అంబులెన్సులు, 1,000 మంది వరకు సిబ్బంది అందుబాటులో ఉంటాయి. నిర్దిష్ట సమయానికి ముందుగానే భక్తులు కాశ్మీర్ చేరుకోవాలని బోర్డు సూచించింది. ఈ యాత్ర కోసం భారీ స్థాయిలో భద్రతా సిబ్బంది పని చేయనున్నారు. స్థానిక పోలీసులతోపాటు కేంద్ర బలగాలు కూడా భద్రతా సేవల్లో పాల్గొంటాయి.

# మేం దేవుడిని నమ్ముతాం: విజయ్



చెన్నై: పెరియార్ రామస్వామి సామాజిక సిద్ధాంతాలను తాము స్వీకరించినప్పటికీ, ఆయన నాస్తికత్వ భావజాలాన్ని అంగీకరించలేదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. తాము దేవుడిని విశ్వసిస్తామని, ఈ విషయాన్ని ఎప్పుడూ దాచలేదని చెప్పారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై అసెంబ్లీలో మాట్లాడిన విజయ్ తమ ప్రభుత్వానికి పెరియార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ సీఎం కామరాజ్ సిద్ధాంతాలే స్ఫూర్తి అని పేర్కొన్నారు. సమాన అవకాశాలు, సామాజిక న్యాయంపై అంబేద్కర్ ఆలోచనలను స్వీకరించామని తెలిపారు. నిజాయతీతో కూడిన పాలన విషయంలో కామరాజ్‌ను ఆదర్శంగా తీసుకున్నామని చెప్పారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండానే పోటీ చేసి 35 శాతం ఓట్లు సాధించిందని విజయ్ తెలిపారు. 1.72 కోట్ల ఓట్లు పొందిన తమ పార్టీ స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదిగిందని అన్నారు. ముందుగా ప్రజల వద్దకు వెళ్లి వారి మద్దతు సంపాదించాకే పార్టీని ఏర్పాటు చేశామని చెప్పారు. రాజకీయ ప్రత్యర్థులు, భావజాల ప్రత్యర్థుల మధ్య తాము స్పష్టమైన తేడా పాటిస్తున్నామని విజయ్ పేర్కొన్నారు. తమ పార్టీని కేవలం సినీ నటుడి పార్టీగా అభివర్ణించే వారు దాని ఎదుగుదలను అర్థం చేసుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. 2026 ఎన్నికల్లో మతం, కులం అనే గోడలను చెరిపేసి ప్రజల మద్దతు పొందామని చెప్పారు. గత ప్రభుత్వం పార్టీ నిధుల పేరుతో భారీ అవినీతికి పాల్పడిందని విజయ్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వామపక్ష పార్టీలు తమ కూటమిలో స్వచ్ఛందంగానే చేరాయని, ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల కాదని విజయ్ వ్యాఖ్యానించారు.



# ఢిల్లీని ముంచెత్తిన దుమ్ము తుపాను

**గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం మధ్యాహ్నం గురుగ్రామ్ సహా ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని పలు ప్రాంతాలను తీవ్రమైన దుమ్ము తుపాను ముంచెత్తింది. దీని ప్రభావంతో దట్టమైన ధూళి మేఘాలు కమ్ముకోవడమే కాకుండా, బలమైన ఈదురుగాలులు వీచాయి. పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురవడంతో ఎండ తీవ్రత నుంచి ప్రజలకు తాత్కాలిక ఉపశమనం లభించింది. ఈ దుమ్ము తుపాను కారణంగా పలు ప్రాంతాల్లో ఎదురుగా ఉన్నవి కూడా కనిపించలేదు. గురుగ్రామ్‌లో ప్రారంభమైన ఈ తుపాను క్రమంగా ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్ పరిసర ప్రాంతాలకు విస్తరించింది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన వివరాల ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో గాలి వేగం గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వరకు నమోదైంది. దీని ఫలితంగా వ్యవసాయ భూముల వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 39.8 డిగ్రీల సెల్సియస్ నుంచి ఏకంగా 28.8 డిగ్రీలకు పడిపోయింది. ఈ వాతావరణ మార్పులకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐఎండీ ఢిల్లీ-ఎన్‌సీఆర్‌కు ఆరెంజ్, రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే కొద్ది గంటల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 80-100 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు. రానున్న రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39-41 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

# దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ పతనం

ముంబై: ప్రతికూల సంకేతాల మధ్య దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలతో ముగిశాయి. మెటల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ (పీఎస్‌యూ) షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాల ఒత్తిడితో సూచీలు కుప్పకూలాయి. రోజంతా ఒడుదొడుకులకు లోనైన మార్కెట్లు చివరికి నష్టాల్లోనే స్థిరపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 893.39 పాయింట్లు నష్టపోయి 76,200.68 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 278.80 పాయింట్లు పతనమై 23,824.10 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీనతలు దేశీయ ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో అన్ని రంగాల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. నిఫ్టీలో ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టీసీఎస్ వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3 శాతానికి పైగా పతనమై అత్యధికంగా నష్టపోయింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతానికి పైగా క్షీణించగా, పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ కూడా డీలా పడింది. బ్రాడర్ మార్కెట్లోనూ ఇదే ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.05 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.48 శాతం చొప్పున నష్టపోయాయి. అయితే, ఈ అమ్మకాల హోరులోనూ ఫార్మా, హెల్త్‌కేర్ వంటి రక్షణాత్మక రంగాల షేర్లు మెరుగైన పనితీరు కనబరిచాయి. ఇటీవల మార్కెట్లు లాభపడటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం కూడా పతనానికి ఒక కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రుతుపవనాల పురోగతి, అమెరికా-భారత్ వాణిజ్య చర్చలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారని వారు తెలిపారు.

# దేశంలో 109 కోట్ల ఇంటర్నెట్ యూజర్లు

న్యూఢిల్లీ: భారత టెలికంరంగం అప్రతిహత వృద్ధిని కొనసాగిస్తోంది. దేశంలో ఇంటర్నెట్, టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టెలికంరెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తన తాజా నివేదికలో వెల్లడించింది. 2026 మార్చి నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 109.27 కోట్లకు చేరింది. 2025 డిసెంబర్ చివరి నాటికి ఈ సంఖ్య 102.86 కోట్లుగా ఉండగా, కేవలం మూడు నెలల్లోనే 6.24 శాతం వృద్ధి నమోదైంది. ట్రాయ్ నివేదిక ప్రకారం.. మొత్తం ఇంటర్నెట్ వినియోగదారులలో 104.62 కోట్ల మంది వైర్‌లెస్ (మొబైల్) ద్వారా, 4.65 కోట్ల మంది వైర్డ్ కనెక్షన్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు. వీరిలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 106.58 కోట్లుగా ఉండగా, న్యారోబ్యాండ్ (56 కేబీపీఎస్ కంటే తక్కువ వేగం) సబ్‌స్క్రైబర్లు 2.69 కోట్లుగా ఉన్నారు. త్రైమాసిక ప్రాతిపదికన బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల బేస్ 5.81 శాతం పెరగడం విశేషం. ఇంటర్నెట్‌తో పాటు మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య కూడా 133.05 కోట్లకు పెరిగింది. దీంతో దేశవ్యాప్తంగా టెలి-డెన్సిటీ (ప్రతి 100 మందికి ఉన్న ఫోన్ కనెక్షన్లు) గత త్రైమాసికంలోని 91.74 శాతం నుంచి 93.26 శాతానికి మెరుగుపడింది. వైర్‌లైన్ టెలి-డెన్సిటీ సైతం 3.33 శాతం నుంచి 3.38 శాతానికి పెరిగింది. వినియోగదారుల నుంచి వచ్చే సగటు నెలవారీ ఆదాయం (ఏఆర్‌పీయూ) కూడా టెలికంసంస్థలకు సానుకూలంగా ఉంది. వైర్‌లెస్ సేవలకు సంబంధించి ఏఆర్‌పీయూ 0.76 శాతం పెరిగి రూ.196.04కి చేరింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 7.15 శాతం పెరుగుదల. అదేవిధంగా, వినియోగ సమయం (ఎంఓయూ) కూడా స్వల్పంగా పెరిగి నెలకు సగటున 1,017 నిమిషాలకు చేరింది. టెలికంరంగం వృద్ధి ప్రభుత్వ ఆదాయానికి కూడా ఊతమిచ్చింది. 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో టెలికంకంపెనీల నుంచి లైసెన్స్ ఫీజు (ఎల్ఎఫ్) రూపంలో ప్రభుత్వానికి రూ.6,936 కోట్ల ఆదాయం లభించింది. అంతకుముందు త్రైమాసికంలో ఇది రూ.6,733 కోట్లుగా ఉంది.




# ఇరాన్ చమురుపై సడలిన ఆంక్షలు

**ఆగస్టు 21 వరకు 60 రోజుల పాటు చమురు అమ్మకాలకు అనుమతి**

**ప్రపంచ మార్కెట్లో తగ్గిన ముడి చమురు ధరలు**

టెహ్రాన్: అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ చమురు పరిశ్రమకు ఊహించని ఊరటనిస్తూ అమెరికా సంచలన నిర్ణయం తీసుకుంది. ఇరాన్‌పై విధించిన కఠినమైన ఆంక్షలను తాత్కాలికంగా సడలిస్తూ 60 రోజుల మినహాయింపు ప్రకటించింది. ఆగస్టు 21 వరకు అమల్లో ఉండే ఈ నిర్ణయం ప్రకారం ఇరాన్ నుంచి ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల ఉత్పత్తి, అమ్మకం, రవాణా, దిగుమతులకు అనుమతి లభించింది. టెహరాన్‌తో విస్తృత శాంతి ఒప్పందం, అంతర్జాతీయ అణు తనిఖీలను తిరిగి ప్రారంభించే లక్ష్యంతో జరుగుతున్న చర్చల్లో భాగంగా అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. ఇది ఇరు దేశాల మధ్య నమ్మకాన్ని పెంచే చర్యగా భావిస్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు దిగుమతిదారుల్లో ఒకటైన భారత్‌కు ఈ పరిణామం వ్యూహాత్మకంగా ఎంతో మేలు చేయనుంది. తన మొత్తం చమురు అవసరాల్లో దాదాపు 85 శాతం దిగుమతులపైనే ఆధారపడే భారత్, అంతర్జాతీయ ధరల ఒడిదొడుకులకు తీవ్రంగా ప్రభావితమవుతుంది. ముడి చమురు ధరల్లో ఏ చిన్న పెరుగుదలైనా దేశ దిగుమతి బిల్లు, ద్రవ్యోల్బణం, ఇంధన ధరలపై పెను ప్రభావాన్ని చూపుతుంది. గత నాలుగేళ్లలో భారత్ చమురు దిగుమతుల సరళిలో భారీ మార్పులు వచ్చాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత భారత్ రాయితీపై లభించే రష్యన్ ముడి చమురుకు అతిపెద్ద కొనుగోలుదారుగా అవతరించింది. ప్రస్తుతం మన దేశ మొత్తం దిగుమతుల్లో రష్యా వాటా దాదాపు 30-40 శాతంగా ఉంది. అదే సమయంలో సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాలపై కూడా భారత్ అధికంగా ఆధారపడి ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారీ, ఈ ఏకపక్ష ధోరణి వల్ల సరఫరాకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పుడు ఇరాన్ తిరిగి మార్కెట్లోకి వస్తే, భారత్‌కు మరో కీలకమైన, నమ్మకమైన చమురు వనరు అందుబాటులోకి వస్తుంది.




# అందుబాటులోకి మళ్లీ టెలిగ్రామ్

న్యూఢిల్లీ: నీట్ యూజీ-2026 రీఎగ్జామినేషన్ నేపథ్యంలో భారత్‌లో తాత్కాలికంగా నిలిపివేసిన టెలిగ్రామ్ సేవలను మళ్లీ పునరుద్ధరించారు. వారంపాటు నిషేధం అనంతరం మంగళవారం నుంచి గూగుల్ ప్లే స్టోర్‌లో టెలిగ్రామ్ యాప్ తిరిగి అందుబాటులోకి వచ్చింది. నీట్ యూజీ రీ-ఎగ్జామ్‌ను లక్ష్యంగా చేసుకొని కొందరు చీటింగ్ ముఠాలు టెలిగ్రామ్‌ను ఉపయోగించి అభ్యర్థులను మోసం చేస్తున్నారనే ఆరోపణలతో జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కేంద్రం జూన్ 16 నుంచి 22 వరకు టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా నిషేధించింది. అయితే టెలిగ్రామ్‌లో సందేశాలను సవరించే (మెసేజ్ ఎడిట్) ఫీచర్‌పై విధించిన ఆంక్షలు మాత్రం జూన్ 30 వరకు కొనసాగనున్నాయి. ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్ అందుబాటులోకి వచ్చినప్పటికీ, యాపిల్ యాప్ స్టోర్‌లో మాత్రం ఇంకా కనిపించడం లేదు.

# ఇరాన్‌లో 3,292 మంది ఇజ్రాయెల్ ముఠా అరెస్ట్

**ఇజ్రాయెల్ తరఫున గూఢచర్యం, దేశ వ్యతిరేక ప్రచారాల ఆరోపణలు**

టెహ్రాన్: ఇజ్రాయెల్, అమెరికాతో సైనిక ఘర్షణలు ముగిసి ఇప్పుడిప్పుడే కాల్పుల విరమణ ఒప్పందాల దిశగా అడుగులు పడుతున్న తరుణంలో.. ఇరాన్‌లో కల్లోలం రేగింది. ఇజ్రాయెల్ నిఘా సంస్థల కోసం గూఢచర్యం చేయడం, ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం సాగించడం వంటి దేశద్రోహ ఆరోపణలపై దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 3,292 మంది పౌరులను ఇరాన్ భద్రతా బలగాలు అరెస్ట్ చేశాయి. ఈ విషయాన్ని ఇరాన్ న్యాయవ్యవస్థ అధికార ప్రతినిధి అస్గర్ జహంగీర్ సోమవారం అధికారికంగా ప్రకటించారు. దేశ అంతర్గత భద్రతను కాపాడటానికి, శత్రుదేశాల నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించడానికి ఈ ఆపరేషన్ అత్యంత కీలకమని ఇరాన్ అధికారులు స్పష్టం చేశారు. అరెస్ట్ అయిన వారిలో 684 మంది ఇజ్రాయెల్ కోసం క్షేత్రస్థాయిలో నేరుగా 'ఆపరేషనల్ యాక్షన్స్' నిర్వహించారని, మరో 1,258 మంది దేశానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని న్యాయవ్యవస్థ వెల్లడించింది. వీరిలో 1,061 మందిపై ఇప్పటికే అధికారికంగా దోషారోపణలు మోపినట్లు, దేశద్రోహులుగా తేలిన వందలాది మంది అనుమానితుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



# మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

కూకట్‌పల్లి, జూన్ 23 (ఈవార్తలు): మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన "ఇందిర మహిళా శక్తి" కార్యక్రమంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై ఆల్విన్ కాలనీ డివిజన్ మహిళా సంఘాల సభ్యులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సంతోశ్, సౌందర్య, సురేఖ, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.



# సబ్‌స్టేషన్ ఏర్పాటు వద్దు

## బూరుగుపల్లి గ్రామస్తుల నిరసన

ధర్మపురి, జూన్ 23 (ఈవార్తలు): బూరుగుపల్లి గ్రామంలోని 89 సర్వే నంబర్ భూమిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు మంగళవారం 63వ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే గ్రామానికి అవసరమైన భూమి లేకుండా పోతుందని, ఐకేపీ కొనుగోలు కేంద్రం, క్రీడా ప్రాంగణం, అంగన్వాడీ కేంద్రం వంటి ప్రభుత్వ నిర్మాణాలకు ఇబ్బందులు కలుగుతాయని గ్రామస్తులు తెలిపారు. సుమారు గంటపాటు నిరసన కొనసాగడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ధర్మపురి తహసీల్దార్ ఎరుకొండ శ్రీనివాస్, ఎస్సై జి. మహేష్ గ్రామస్తులతో చర్చించి సమస్యను పరిశీలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



# ర్యాపర్ పాఠశాలకు 'స్వచ్ఛ ఎవం హరిత విద్యాలయ' అవార్డు

జగిత్యాల, జూన్ 23 (ఈవార్తలు): స్వచ్ఛ ఎవం హరిత విద్యాలయ పురస్కారాల్లో భాగంగా జాతీయస్థాయిలో ఎంపికైన బీర్పూర్ ప్రాథమిక పాఠశాల సిబ్బందిని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అభినందించారు. గత విద్యా సంవత్సరం 2025-26లో నిర్వహించిన స్వచ్ఛ విద్యాలయ పోటీల్లో తెలంగాణ నుంచి 10 పాఠశాలలు జాతీయస్థాయికి ఎంపిక కాగా, వాటిలో జగిత్యాల జిల్లా నుంచి బీర్పూర్ పాఠశాల స్థానం సంపాదించింది. జిల్లాలోని 1,046 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు స్వచ్ఛత, పరిశుభ్రత తదితర ఆరు అంశాల్లో పోటీ పడగా, బీర్పూర్ పాఠశాల అన్ని అంశాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇతర పాఠశాలలు కూడా ఇదే తరహాలో ఉత్తమ ప్రమాణాలతో ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రాము, పాఠశాల సిబ్బంది, సమగ్ర శిక్ష అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ధర్మపురికి కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసులు

## భక్తులు, విద్యార్థులకు మరింత సౌకర్యం.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడి

ధర్మపురి, జూన్ 23 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ధర్మపురికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ధర్మపురి-నిర్మల్, ధర్మపురి-కరీంనగర్ మధ్య రెండు కొత్త బస్సు సర్వీసులను ధర్మపురి బస్టాండ్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తుల కోసం నిర్మల్-ధర్మపురి ఎక్స్‌ప్రెస్ బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అలాగే రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం, చొప్పదండి మీదుగా కరీంనగర్‌కు కొత్త సర్వీస్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ సర్వీసులు విద్యార్థులు, ఉద్యోగులు, భక్తులకు ఉపయోగపడతాయన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో మరో 11 కొత్త రూట్లలో బస్సు సర్వీసులు నడిపేందుకు అనుమతులు పొందినట్లు మంత్రి వెల్లడించారు. ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించి సంస్థ ఆదాయ వృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహించాలి

## ఖమ్మం కలెక్టర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి



ఖమ్మం, జూన్ 23 (ఈవార్తలు): జర్నలిస్టులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైతిక విలువలు, డిజిటల్ మీడియా నైపుణ్యాలపై ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (హెచ్-2843) ఖమ్మం జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, జిల్లా కార్యదర్శి అర్వపల్లి నాగేష్ ఆధ్వర్యంలో ప్రతినిధులు సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిజం రంగంలో సాంకేతిక పరిజ్ఞానం, వాస్తవ నిర్ధారణ (ఫ్యాక్ట్ చెకింగ్), నైతిక ప్రమాణాల ప్రాధాన్యం మరింత పెరిగిందన్నారు. సోషల్ మీడియా విస్తరిస్తున్న నేపథ్యంలో నిజమైన వార్తలను గుర్తించే సామర్థ్యాన్ని జర్నలిస్టులు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వార్తలను ఏకపక్షంగా కాకుండా అన్ని కోణాల్లో పరిశీలించి ప్రజలకు సమగ్ర సమాచారం అందించడంతో పాటు, సమాచార మూలాల గోప్యతను కాపాడే బాధ్యత కూడా జర్నలిస్టులపై ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ప్రింట్, టెలివిజన్ మాధ్యమాల కంటే డిజిటల్ మీడియా వేగంగా అభివృద్ధి చెందుతున్నందున కొత్త తరం పాత్రికేయులు ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించాలని సూచించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో స్మార్ట్‌ఫోన్‌తోనే నాణ్యమైన వార్తలు, ఇంటర్వ్యూలు, వీడియోలు రూపొందించే విధానాలపై శిక్షణ ఇవ్వాలని వారు కోరారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం, వార్తల విశ్లేషణ, పరిశోధన, ఫేక్ న్యూస్ గుర్తింపు, డేటా జర్నలిజం, గణాంకాల విశ్లేషణ, గ్రాఫిక్స్ ద్వారా సమాచారాన్ని ప్రజలకు సులభంగా చేరవేసే అంశాలపై కూడా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వేములకొండ రమేష్, ఉపాధ్యక్షులు కందరబోయిన నాగకృష్ణ, మామిడాల వీరబాబు, టిబిజేఏ జిల్లా అధ్యక్షుడు వందనపు సామ్రాట్ గుప్తా, జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరబోయిన ఉపేందర్, సంయుక్త కార్యదర్శి కరుణాకర్ సుదగాని, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షుడు గంటేల కుమార్, టిబిజేఏ నగర అధ్యక్షుడు ఎలుగోటి వెంకట్, సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్, కప్పల మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# జగిత్యాల పట్టణానికి బైపాస్ రహదారి మంజూరు

## అంతర్గాం, అంబారీపేట వద్ద అండర్‌పాస్‌లు: అర్వింద్

జగిత్యాల, జూన్ 23 (ఈవార్తలు): జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా జగిత్యాల పట్టణానికి బైపాస్ రహదారి మంజూరైనట్లు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. అంతేకాకుండా అంతర్గాం, అంబారీపేట గ్రామాల వద్ద అండర్‌పాస్‌లు కూడా కేంద్ర ప్రభుత్వం ఆమోదించినట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి గడ్కరీకి తాను లేఖ ద్వారా విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో అధికారిక స్పందన వచ్చిందని ఆయన వెల్లడించారు. జగిత్యాల-కరీంనగర్ రహదారిని 4 లేన్లుగా విస్తరించడంతో పాటు బైపాస్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపిందని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర సహకారంతో మరిన్ని ప్రాజెక్టులు తీసుకురావడానికి కృషి కొనసాగిస్తానని ఆయన తెలిపారు. జిల్లా ప్రజల తరఫున కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ధర్మపురి అర్వింద్ కృతజ్ఞతలు తెలిపారు.




# జగిత్యాలలో ఏబీవీపీ బంద్ విజయవంతం

జగిత్యాల, జూన్ 23 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని, ఎంఈఓ, డీఈఓ పోస్టులను వెంటనే నింపాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) డిమాండ్ చేసింది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న ఫీజులపై నియంత్రణ చట్టం అమలు చేయాలని కోరుతూ జగిత్యాల జిల్లా వ్యాప్తంగా పాఠశాలల బంద్‌ను ఏబీవీపీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మల్యాల రాకేష్, రాపాక నిఖిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, ప్రహరీ గోడలు, భద్రత వంటి కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చుతున్నాయని, పుస్తకాలు, యూనిఫారాల పేరుతో అదనపు భారాన్ని మోపుతున్నాయని ఆరోపించారు. అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని వేల పాఠశాలలను మూసివేసే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ ప్రభుత్వం వెంటనే నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం 2020ను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం అమలుపై ఇంకా చర్యలు ప్రారంభం కాలేదని విమర్శించారు.

# హలో బీసీ - ఛలో భువనగిరి పోస్టర్ ఆవిష్కరణ



జగిత్యాల, జూన్ 23 (ఈవార్తలు): తెలంగాణలో బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక హక్కులు సాధించాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జూలై 5న భువనగిరిలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" సభకు ఆహ్వానం పలుకుతూ "హలో బీసీ - ఛలో భువనగిరి" పోస్టర్‌ను బుధవారం జగిత్యాల పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించిన అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు మాదం రజని కుమార్ యాదవ్ చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు పాపన్న అధ్యక్షత వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా బీసీ వర్గాల రాజకీయ సాధికారత కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. భువనగిరిలో జరగబోయే రాజ్యాధికార సమరభేరి సభ బీసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవబోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం, అధికారంలో భాగస్వామ్యం, విద్యా మరియు ఉపాధి అవకాశాలలో సముచిత వాటా కల్పించాలనే ప్రధాన డిమాండ్లతో ఈ సభ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. జగిత్యాల జిల్లా ప్రజలకు, ముఖ్యంగా బీసీ సంఘాల నాయకులు, యువత, మహిళలు మరియు సామాజిక కార్యకర్తలకు ఈ సభలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన, మండల స్థాయిలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మరియు వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలు, బీసీల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని నాయకులు పేర్కొన్నారు. రాబోయే భువనగిరి సభ తెలంగాణ రాజకీయాల్లో బీసీల హక్కుల సాధనకు ఒక చారిత్రాత్మక మలుపుగా నిలుస్తుందని, బీసీ సమాజం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి అఖిల్ జిల్లా నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పాత ఎమ్మార్వో ఆఫీస్ ప్లేస్‌లో

# పెట్రోల్ బంక్ వద్దు

## కలెక్టర్‌కు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లేఖ



జగిత్యాల, జూన్ 23 (ఈవార్తలు): జగిత్యాల తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. పాత తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండటంపై ఆయన స్పందించారు. తహసీల్ చౌరస్తా ప్రాంతంలో ఇప్పటికే తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఉందని, అక్కడ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే రద్దీ మరింత పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ సముదాయంలో ఆర్డీవో కార్యాలయం, జగిత్యాల అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు పనిచేస్తున్నాయని తెలిపారు. కొత్తగా మరో తహసీల్దార్ కార్యాలయం కూడా మంజూరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజల రాకపోకలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం భద్రతా సమస్యలకు కూడా దారి తీస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా పాత బస్టాండ్ సమీపంలోని పోలీస్ క్వార్టర్స్ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే రహదారి వెడల్పుగా ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయని సూచించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో బంక్ ప్రతిపాదనను నిలిపివేయాలని కోరారు.

# గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

## విద్యార్థులకు పోలీసుల అవగాహన

జగిత్యాల, జూన్ 23 (ఈవార్తలు): మాదకద్రవ్యాల నిర్మూలన, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడే లక్ష్యంతో జగిత్యాల జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పోలీసు అధికారులు విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తి, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. గంజాయి, డ్రగ్స్ వంటి నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, రవాణా, విక్రయం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, ఇతర సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.



# డీటీఓ వెంకన్నకు జగిత్యాలలో ఘన నివాళి

జగిత్యాల, జూన్ 23 (ఈవార్తలు): భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) వెంకన్న అకాల మరణం పట్ల తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో జగిత్యాలలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు మాట్లాడుతూ, డీటీఓ వెంకన్నతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణకు ఆయన ప్రతీకగా నిలిచారని కొనియాడారు. ఆయన మరణం రవాణా శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. డీటీవో సంధాని మాట్లాడుతూ, ఇటీవలే బదిలీపై వెళ్లిన వెంకన్న విధి నిర్వహణలోనే అకాల మరణం చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సేవలను రవాణా శాఖ ఎప్పటికీ మరవలేదన్నారు. అనంతరం ట్రస్మా ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించి వెంకన్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు రామారావు, సాయికిరణ్, రియాజ్, ట్రస్మా నాయకులు రవిప్రసాద్, గంగారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రాజుగౌడ్, రవీందర్, రాబర్ట్, రాంబాబు, రాజేందర్, విలేకరులు, అభిమానులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లవ్లీ చిత్రం



కృతిసనన్

# షో రద్దు.. బుక్ మై షోకు రూ.12 వేల జరిమానా!

ఆన్‌లైన్‌లో సినిమా టికెట్లు బుక్ చేసుకున్న కస్టమర్లకు.. షో రద్దయిన సమాచారాన్ని ముందుగా చెప్పకుండా ఇబ్బందులకు గురిచేసిన ప్రముఖ ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్ మై షో కు కోర్టులో గట్టి చుక్కెదురైంది. కస్టమర్లకు కనీస సమాచారం ఇవ్వకుండా, వారి సమయాన్ని వృథా చేస్తూ మానసిక వేదనకు గురిచేసినందుకు గాను బుక్ మై షో లైవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు హైదరాబాద్ జిల్లా వినియోగ దారుల కమిషన్ భారీ జరిమానా విధించింది. బాధితుడికి రూ.10 వేల నష్టపరిహారంతో పాటు, కోర్టు ఖర్చుల కింద మరో రూ.2 వేలు చెల్లించాలని తీర్పు వెలువరించింది. కూకట్‌పల్లికి చెందిన నారాయణన్ కుట్టిగోపాల కృష్ణన్ అనే వ్యక్తి.. 2025 జనవరి 1న కొత్త సంవత్సరం రోజున కుటుంబంతో కలిసి సినిమా చూడాలని ప్లాన్ చేసుకున్నారు. అందుకోసం కూకట్ పల్లి పరిధిలోని లులు మాల్‌లో ఉన్న సినీపోలిస్ థియేటర్‌లో ఉదయం 10:50 గంటల షోకు బారోజ్ అనే సినిమా టికెట్‌ను బుక్ మై షో యాప్ ద్వారా కొనుగోలు చేశారు. ఎంతో ఉత్సాహంగా ఆయన థియేటర్‌కు వెళ్లేసరికి, అక్కడ సీన్ రివర్స్ అయింది. తాను బుక్ చేసుకున్న బారోజ్ సినిమా షో రద్దయిందని, ఆ స్థానంలో వేరే సినిమా నడుస్తోందని తెలిసి అవాక్కయ్యారు. కనీసం షో రద్దయినట్లు బుక్ మై షో యాప్ నుంచి గానీ, థియేటర్ యాజమాన్యం నుంచి గానీ తనకు ఎలాంటి ముందస్తు సమాచారం రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరం రోజున తన సమయాన్ని వృథా చేయడం తో పాటు, తీవ్ర మానసిక వేదనకు గురిచేశారని పేర్కొంటూ బాధితుడు నేరుగా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసు విచారణ సందర్భంగా బుక్ మై షో సంస్థ కోర్టులో తన వాదన లు వినిపిస్తూ.. తప్పంతా థియేటర్ యాజమాన్యానిదే అన్నట్లుగా కుంటిసాకులు చెప్పే ప్రయత్నం చేసింది. తాము కేవలం వినియోగదారుడికి, థియేటర్‌కు మధ్య ఒక ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌గా మాత్రమే ఉంటామని తెలిపింది. షోలు నడపడం, టైమింగ్స్ మార్చడం, రద్దు చేయడం వంటివన్నీ థియేటర్ యాజమాన్యం చేతుల్లోనే ఉంటాయని పేర్కొంది. అంతేకాకుండా, కస్టమర్ ఫిర్యాదు చేసిన మరుసటి రోజే ఆయన కొనుగోలు చేసిన టికెట్ ధర రూ.207.14 మొత్తాన్ని పూర్తిగా వారి ఖాతాలో రీఫండ్ చేశామని కోర్టుకు వివరించింది. ఇరుపక్షాల వాదనలు విన్న హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్.. బుక్ మై షో వాదనలను తోసిపుచ్చింది. టికెట్ బుక్ చేసుకున్న తర్వాత ఒకవేళ అనివార్య





కారణాల వల్ల షో రద్దయితే, ఆ సమాచారాన్ని కస్టమర్‌కు చేరవేయాల్సిన కనీస బాధ్యత బుక్ మై షో ప్లాట్‌ఫామ్‌పైనే ఉంటుందని స్పష్టం చేసింది. ముందే సమాచారం ఇవ్వకుండా కస్టమర్‌ను థియేటర్ వరకు వచ్చేలా చేయడం ముమ్మాటికీ బుక్ మై షో వైపు ఉన్న సేవాలోపమేనని కమిషన్ తీవ్రంగా తప్పుపట్టింది. తాము మధ్యవర్తులం మాత్రమే అని చెప్పి తప్పించుకోలేరని తేల్చిచెప్పింది. కేవలం టికెట్ డబ్బులు వెనక్కి ఇచ్చినంత మాత్రాన సరిపోదని, వినియోగదారుడి సమయాన్ని వృథా చేసి అతనికి కలిగించిన మానసిక వేదనకు సంస్థ కచ్చితంగా బాధ్యత వహించాల్సిందేనని పేర్కొంటూ బుక్ మై షోకు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.




# అన్నెసీ ఫెస్టివల్‌లో.. 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు మరో సర్‌ప్రైజ్ అందించారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న కొత్త యానిమేషన్ ప్రాజెక్ట్ 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ప్రభాస్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ అభిమానుల్లో భారీ ఆసక్తిని పెంచారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యానిమేషన్ రూపంలో ప్రభాస్ యోధుడి అవతారంలో కనిపించడం అభిమానులకు గూస్‌బంప్స్ కలిగిస్తోంది. 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక యానిమేషన్ ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఫ్రాన్స్‌లోని 'అన్నెసీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026'లో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' ఎంపిక కావడం భారతీయ సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. ఈ ఫెస్టివల్‌లో నిర్వహించే 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' సెషన్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా యానిమేషన్ రంగానికి చెందిన ప్రముఖులు, స్టూడియోలు, నిర్మాతలు, దర్శకుల సమక్షంలో ఈ ప్రాజెక్ట్ ప్రదర్శించబడనుండటం విశేషం. ప్రభాస్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు.



# సెప్టెంబర్ 25న నాని 'ప్యారడైజ్'!?

న్యాచురల్ స్టార్ నాని హీరోగా, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'ది పారడైజ్'పై ప్రేక్షకుల్లో రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ఈ కాంబినేషన్ మరోసారి కలిసి పని చేస్తుండటంతో సినిమా ప్రకటించినప్పటి నుంచే భారీ ఆసక్తి నెలకొంది. అయితే ఈ చిత్రం విడుదల తేదీ విషయంలో గత కొంతకాలంగా అనేక వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 మార్చిలో విడుదల చేయాలని మేకర్స్ భావించినట్లు ప్రచారం జరిగింది. అనంతరం సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఆగస్టు విడుదలకు సంబంధించి కూడా అధికారిక ప్రకటన రాకపోవడంతో సినిమా డిసెంబర్‌కు వెళ్లే అవకాశముందని సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం 'ది పారడైజ్'ను సెప్టెంబర్ 25, 2026న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.ప్రస్తుతం 'ది పారడైజ్' షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాను అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని సమాచారం. ప్రతి సన్నివేశాన్ని ప్రత్యేకంగా డిజైన్ చేస్తూ, పాన్ ఇండియా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని మేకింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలుస్తోంది. సినిమా బడ్జెట్ కూడా అంచనాలను దాటి భారీ స్థాయికి చేరినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయినప్పటికీ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి నమ్మకంతో ఉన్నారట. కంటెంట్, మేకింగ్ స్కేల్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం.



# విజయ్.. త్రిష.. బర్త్ డే!



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు నటి త్రిష పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ చేసిన సోషల్ మీడియా పోస్ట్, గత కొన్ని గంటలుగా వారి స్నేహంపై సాగుతున్న ప్రచారానికి తెరదించింది. విజయ్‌తో కలిసి దిగిన ఒక ఫోటోను పంచుకుంటూ, తమ అనుబంధం ఎంతటిప్రత్యేకమైనదో తెలియజేసేలా ఆమె చేసిన పోస్ట్ ప్రస్తుతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జూన్ 22న విజయ్ 52వ పుట్టినరోజు సందర్భంగా త్రిష నుంచి ఎలాంటి శుభాకాంక్షలు రాకపోవడంతో, ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో విజయ్‌ను అన్‌ఫాలో చేశారనే వార్తలు చర్చకు దారితీశాయి. వారి స్నేహబంధం దెబ్బతిన్నదంటూ సాగిన ఈ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ, విజయ్‌తో ఉన్న ఒక చిత్రాన్ని త్రిష సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. తమ బంధం ఎంతో విశిష్టమైనదనే అర్థం వచ్చేలా ఆమె ఒక భావోద్వేగపూరితమైన క్యాప్షన్‌ను దీనికి జతచేశారు. విజయ్ పుట్టినరోజు సందర్భంగా కట్ చేసిన కేక్ ఫోటోను షేర్ చేస్తూ, "అన్నింటికీ విలువనిచ్చే వ్యక్తికి.. హ్యాపీ బర్త్ డే 00.00" అని క్యాప్షన్ ఇచ్చారు. తన క్యాప్షన్‌లో '00.00' అని పేర్కొనడం ద్వారా, జూన్ 22న అర్ధరాత్రి 12 గంటలకే తాను విజయ్‌కు విషెస్ చెప్పినట్లు త్రిష పరోక్షంగా తెలిపారు. సీఎం విజయ్‌కు త్రిష పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదని, సోషల్ మీడియాలో ఆయన్ను అన్‌ఫాలో చేశారని వచ్చిన కథనాలకు ఈ పోస్ట్‌తో ఆమె సమాధానమిచ్చినట్లు అయింది.

# పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్

నాలుగు దశాబ్దాలుగా వందలాది చిత్రాల్లో వైవిధ్యమైన నటనతో, హాస్యంతో కోట్లాది మంది తెలుగు ప్రేక్షకులను అలరించిన 'నటకిరీటి' రాజేంద్రప్రసాద్.. కళారంగానికి చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించారు. నటుడిగా, నిర్మాతగా 'జయభేరి' బ్యానర్‌పై అద్భుతమైన చిత్రాలు నిర్మించడమే కాకుండా, 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు మురళీమోహన్ కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షాతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.





# ఐదేళ్లుగా నేనే కట్ చేసుకుంటున్నా: శ్రుతి హాసన్

నటి శ్రుతి హాసన్ తన ఫ్యాషన్, జీవనశైలితో ఎప్పుడూ ప్రత్యేకంగా నిలుస్తారు. తాజాగా ఆమె తన జుట్టు సంరక్షణ గురించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచారు. గత ఐదేళ్లుగా తాను కనీసం హెయిర్ సెలూన్‌కు కూడా వెళ్లలేదని, తన జుట్టును తానే కత్తిరించుకోవడంతో పాటు అవసరమైన ట్రీట్‌మెంట్ కూడా ఇంట్లోనే చేసుకుంటానని వెల్లడించారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించిన శ్రుతి, 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో ఒక అభిమాని అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చారు. మీ పొడవైన, నల్లని జుట్టు సౌందర్య రహస్యం ఏంటి? సెలూన్‌కు ఎంత తరచుగా వెళ్తారు? అని అడగ్గా, శ్రుతి ఏమాత్రం దాచుకోకుండా సమాధానమిచ్చారు. "నేను సెలూన్‌కు వెళ్లి దాదాపు ఐదేళ్లయింది. చివరిసారిగా 2017లో నా జుట్టుకు రంగు వేశాను. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి హెయిర్ కలర్ ఉపయోగించలేదు.

# పూచికపుల్లగా హీరోయిన్లు: తమన్నా

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతోంది. ఇటీవల 'ఓ రోమియో', 'ఓదెల-2' వంటి చిత్రాలతో అలరించిన తమన్నా... స్పెషల్ సాంగ్స్‌లోనూ మాస్ స్టెప్పులతో ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే క్రేజీ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో నటిస్తోంది. దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో, బాలాజీ టెలిఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, శ్వేతా తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 26న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమన్నా సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీపై చేసిన కొన్ని బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్లను కేవలం గ్లామర్ బొమ్మలుగా చూసే విధానం తనకు అస్సలు నచ్చలేదని తమన్నా చాలా ఓపెన్‌గా చెప్పింది. సౌత్ ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తుంటుందని, హీరోయిన్లను స్క్రీన్‌పై గౌరవప్రదంగా చూపించే విషయంలో అక్కడ కొంత లోటు కనిపిస్తోందంటూ తన మనసులోని అసంతృప్తిని బయటపెట్టింది. సౌత్ ఇండస్ట్రీలో తాను కాకుండా అనుష్క, నయనతార, సమంత వంటి వారు 10 నుంచి 15 ఏళ్ల పాటు స్టార్ హీరోయిన్లుగా నిలదొక్కుకున్నామంటే.. దానికి కారణం ఈ గ్లామర్, పెర్ఫార్మెన్స్ అనే రెండు విషయాలను పక్కాగా బ్యాలెన్స్ చేయడమేనని తమన్నా చెప్పుకొచ్చింది.




## వైభవ్ జెర్సీ వచ్చేసింది!

అత్యంత పిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 15 ఏళ్ల ప్రాయంలోనే అధికారికంగా 'టీమ్ ఇండియా' (ఇండియన్ క్రికెట్ జెర్సీ) ను అందుకుని సరికొత్త చరిత్ర సృష్టించారు. ఐసీసీ తదుపరి సిరీస్‌ల కోసం భారత జట్టుకు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. ఈ క్రమంలో ఇండియన్ జెర్సీ (Indian Jersey)ని అందుకున్న అనంతరం వైభవ్ సూర్యవంశీ భావోద్వేగానికి లోనయ్యారు. చిన్నతనం నుండి దేశం తరఫున ఆడాలనే తన కల ఈ రోజు జెర్సీని చేతపట్టుకోవడంతో నిజమైందని, ఈ జెర్సీని ధరించడం తన జీవితంలో అత్యంత గర్వించదగ్గ క్షణమని ఆయన పేర్కొన్నారు. కాగా వైభవ్ కు జెర్సీని అధికారికంగా అందించడంపై బీసీసీఐ ఓ వీడియోను విడుదల చేసింది.



## పద్మశ్రీ అందుకున్న రోహిత్ శర్మ

టీమిండియా మాజీ కెప్టెన్, రోహిత్ శర్మకు దేశ అత్యున్నత పౌర పురస్కారం దక్కింది. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అత్యంత వైభవంగా జరిగిన పద్మ అవార్డుల ప్రదానోత్సవ రెండో విడత కార్యక్రమంలో రోహిత్ శర్మ 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ఈ ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించారు. క్రికెట్‌లో దేశానికి రోహిత్ అందించిన అసాధారణ సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మ అవార్డుతో సత్కరించింది. కాగా, రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత్ 2024లో బార్బడోస్ వేదికగా ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకుంది. అనంతరం దుబాయ్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టోర్నీలోనూ టీమిండియాను ఛాంపియన్‌గా నిలపడంలో రోహిత్ శర్మ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. అదేవిధం వన్డే క్రికెట్ హిస్టరీలో అత్యధిక వ్యక్తిగత స్కోరు 264 పరుగులు సాధించిన రికార్డుతో పాటు ఏకంగా 3 డబుల్ సెంచరీలు బాదిన ఏకైక బ్యాటర్‌గా రోహిత్ శర్మ ప్రపంచ క్రికెట్‌లో ప్రత్యేక ముద్ర వేశారు. గతంలో సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీ వంటి పలువురు దిగ్గజ క్రికెటర్లు పద్మ పురస్కారాలను అందుకోగా.. ఇప్పుడు ఆ దిగ్గజాల సరసన రోహిత్ శర్మ కూడా చేరాడు,




## ఫాల్కన్స్‌పై రైజర్స్ ఘన విజయం

### త్యాగరాజన్ ఆల్‌రౌండ్ షో

తెలంగాణ టీ20 లీగ్-2026లో భాగంగా ఇవాళ (జూన్ 23) రాత్రి జరిగిన మ్యాచ్‌లో మెదక్ ఫాల్కన్స్‌పై రంగారెడ్డి రైజర్స్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బౌలింగ్ చేసిన రైజర్స్.. ఫాల్కన్స్‌ను 164 పరుగులకే (8 వికెట్ల నష్టానికి) కట్టడి చేసింది. అనంతరం రైజర్స్ బ్యాటర్లు మరో 10 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించారు (5 వికెట్ల నష్టానికి). కెప్టెన తనయ్ త్యాగరాజన్ బంతితో (4-0-36-3), బ్యాట్‌తో (11 బంతుల్లో 21) సత్తా చాటి రైజర్స్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. తనయ్ త్యాగరాజన్ 3 వికెట్లతో పాటు ఓ క్యాచ్ పట్టి ఫాల్కన్స్‌ను కట్టడి చేశాడు. మిగతా బౌలర్లలో జడ్డూ, కరియప్ప తలో 2 వికెట్లు తీయగా.. అరుణ్ కుమార్ ఓ వికెట్ దక్కించుకున్నాడు. ఫాల్కన్స్ ఇన్నింగ్స్‌లో 49 పరుగులు చేసిన విక్రమ్ నాయక్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సాయి కాకులమర్రి (38), నమన్ అగర్వాల్ (37) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. 165 పరుగుల లక్ష్య ఛేదనలో రైజర్స్ ఓపెనర్లు శుభారంభం అందించారు. ఆరోన్ జార్జ్ (27), అరవెల్లి అవనీశ్ (25) మెరుపు ఇన్నింగ్స్‌లతో గెలుపుకు గట్టి పునాది వేశారు. ఆతర్వాత వచ్చిన ఆదిత్య (12), అలంక్రిత్ (9) నిరాశపరిచినా.. రాకేశ్ (38 నాటౌట్) బాధ్యతాయుతంగా ఆడి రైజర్స్‌ను గెలుపుతీరాలకు చేర్చాడు. అతనికి తనయ్ త్యాగరాజన్, నితిన్ యాదవ్ (28 నాటౌట్) సహకరించారు. ఫాల్కన్స్ బౌలర్లలో వరుణ్ 2 వికెట్లు పడగొట్టగా.. రవితేజ, అబ్బాస్, అశ్విన్ రామ్ తలో వికెట్ దక్కించుకున్నారు.



# హాకీలోనూ పాక్ తుక్కు రేగ్గొట్టారు!

## ఉత్కంఠ పోరులో పాక్‌పై భారత్ గెలుపు

లండన్ వేదికగా జరిగిన ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ మ్యాచ్‌లో భారత సీనియర్ పురుషుల హాకీ జట్టు పాకిస్తాన్ టీమ్‌పై 4-3 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ సమిష్టి ప్రదర్శనతో విజయం సాధించింది. భారత్ తరఫున అభిషేక్, రాజిందర్, నీలకంఠ, సుఖ్‌జీత్ గోల్స్ చేశారు. ఈ మ్యాచ్‌కు ముందు భారత్ నెదర్లాండ్స్‌పై 3-2తో అద్భుత విజయం సాధించి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగింది.

యూరప్ లెగ్‌లో తొలి ఓటమి తర్వాత జట్టు గణనీయంగా పుంజుకుని జర్మనీ, నెదర్లాండ్స్‌లాంటి బలమైన జట్లపై విజయాలు నమోదు చేసింది. క్రెయిగ్ ఫుల్టన్ శిక్షణలో భారత జట్టు రక్షణ, దాడి విభాగాల్లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. ముఖ్యంగా చివరి కొన్ని మ్యాచ్‌ల్లో భారత ఆటగాళ్లు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మంచి ఫలితాలు రాబడుతున్నారు. ఇప్పటికే టోర్నీలో వరుస ఓటములతో ఇబ్బంది పడుతున్న పాక్‌కు ఇది మరో ఎదురుదెబ్బగా మారింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ ఓడిన ఆ జట్టు.. పట్టికలో చివరి స్థానంలో కొనసాగుతోంది. పాక్ రెలిగేషన్ ప్రమాదం నుంచి బయటపడాలంటే మిగిలిన మ్యాచ్‌ల్లో తప్పక విజయాలు సాధించాలి. ఈ టోర్నీలో భారత్ మరోసారి పాక్‌తో తలపడాల్సి ఉంది. అలాగే ఇంగ్లండ్‌తో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌ల్లోనూ భారత్ మెరుగైన ఫలితాలు సాధించి సీజన్‌ను సానుకూలంగా ముగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.




## బెన్ స్టోక్స్ ఈజ్ బ్యాక్

కెన్నింగ్‌టన్ ఓవల్‌లో భంగపడిన ఇంగ్లండ్ సిరీస్ పట్టేయాలనే కసితో ఉంది. సిరీస్‌ను సమం చేసిన న్యూజిలాండ్‌ను నాటింగ్‌హమ్‌లో చిత్తు చేయాలనుకుంటున్న ఆతిథ్య జట్టు నాలుగు మార్పులు చేసింది. లండన్ నైట్ క్లబ్ వివాదం సద్దుమణగడంతో కెప్టెన్ బెన్ స్టోక్స్, పేసర్ గస్ అట్కిన్సన్‌లు తిరిగి జట్టులోకి వచ్చారు. వికెట్ కీపర్‌గా జేమీ స్మిత్ ఎంపికవ్వగా.. స్పిన్నర్‌గా షోయబ్ బషీర్‌ను సెలెక్టర్లు తీసుకున్నారు. సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో 253 పరుగుల తేడాతో ఊహించని ఓటమి నుంచి తేరుకున్న ఇంగ్లండ్ మూడో టెస్టుకు పక్కాగా సిద్ధమైంది. జూన్ 25 గురువారం నాటింగ్‌హమ్‌లో మ్యాచ్ గెలిచి సిరీస్‌ను తన్నుకుపోవాలనుకుంటున్న ఆతిథ్య జట్టు.. నాలుగు మార్పులతో బరిలోకి దిగుతోంది. ఓవల్ టెస్టు ఆడిన జోర్డాన్ కాక్స్, రెవ్, సోనీ బేకర్, ఫిషర్‌పై వేటు పడింది. బెన్ స్టోక్స్ తిరిగి కెప్టెన్సీ చేపట్టగా.. జేమీస్మిత్, సోయబ్ బషీర్, అట్కిన్సన్ తుది జట్టులోకి వచ్చారు.. రెట్టించిన ఉత్సాహంతో ఇంగ్లండ్ కనిపిస్తోంది.ఇంగ్లండ్ తుది జట్టు : బెన్ డకెట్, ఎమిలియో గే, జాకబ్ బెథెల్, జో రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్(వికెట్ కీపర్), బెన్ స్టోక్స్(కెప్టెన్), అట్కిన్సన్, ఆర్చర్, జోష్ టంగ్, షోయబ్ బషీర్.



## ఢిల్లీకి పంత్.. లక్నోకు కుల్దీప్ అధికారిక ట్రేడింగ్ పూర్తి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలోనే సంచలన ప్లేయర్ ట్రేడింగ్ డీల్ అఫీషియల్గా పూర్తయింది. క్రికెట్ లవర్స్ ఎదురుచూస్తున్న ఈ మెగా డీల్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీలు తమ స్టార్ ఆటగాళ్లను ఎక్స్ఛేంజ్ చేసుకున్నాయి. ఈ ట్రేడ్‌తో స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ తిరిగి తన పాత హోమ్ టీమ్ ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి రీ-ఎంట్రీ ఇవ్వగా, టీమిండియా స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్ గూటికి చేరాడు. 2025 మెగా వేలంలో ఐపీఎల్ చరిత్రలోనే అత్యధికంగా ఏకంగా రూ.27 కోట్ల రికార్డు ధరతో లక్నో సూపర్ జెయింట్స్ దక్కించుకున్న రిషభ్ పంత్, అక్కడ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. లక్నో కెప్టెన్‌గా రెండు సీజన్లలోనూ విఫలం కావడంతో పాటు బ్యాటింగ్‌లోనూ తడబడ్డాడు. ఈ నేపథ్యంలో పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి వెళ్లేందుకు మొగ్గు చూపాడు. అయితే ఈ ట్రేడ్ కోసం పంత్ ఏకంగా రూ.12 కోట్ల భారీ మొత్తాన్ని తగ్గించుకోవడానికి అంగీకరించడం గమనార్హం. ఇప్పుడు రూ. 15 కోట్ల సవరించిన ఫీజుతో పంత్ అధికారికంగా ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరాడు. మరోవైపు, ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున గత కొన్ని సీజన్లుగా అత్యంత విజయవంతమైన బౌలర్‌గా రాణిస్తున్న చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఇప్పుడు లక్నో సూపర్ జెయింట్స్ జెర్సీ ధరించనున్నాడు. ఢిల్లీ తరఫున 65 మ్యాచ్‌ల్లో 72 వికెట్లు పడగొట్టి సత్తా చాటిన కుల్దీప్.. తన ప్రస్తుత ఫీజు అయిన రూ. 13.5 కోట్లకు లక్నో జట్టుకు ట్రేడ్ అయ్యాడు. లక్నో స్పిన్ విభాగాన్ని బలోపేతం చేయడంలో కుల్దీప్ కీలక పాత్ర పోషించనున్నాడు.



## ఐసీసీ నిర్ణయం భేష్: దీపికా పదుకోన్

మహిళా క్రికెటర్ల కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) రూపొందించిన నూతన మార్గదర్శకాలను బాలీవుడ్ నటి దీపికా పదుకొణె ప్రశంసించారు. ప్రసవానంతరం క్రీడాకారిణులు తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు వెసులుబాటు కల్పించేలా రూపొందించిన ఈ నిబంధనలను, మహిళా క్రీడా రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టంగా ఆమె అభివర్ణించారు. ప్రస్తుతం రెండోసారి గర్భవతిగా ఉన్న దీపిక, ఈ మార్గదర్శకాలకు సంబంధించిన వార్తను మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంటూ ఐసీసీ నిర్ణయానికి మద్దతు తెలిపారు. ఇంగ్లాండ్‌లో జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచకప్‌నకు విరామం ప్రకటించిన రోజున ఐసీసీ ఈ 'రిటర్న్ టు ప్లే పోస్ట్ ప్రెగ్నెన్సీ గైడ్‌లైన్స్'ను సోమవారం విడుదల చేసింది. గర్భం దాల్చిన సమయం నుంచి ప్రసవం తర్వాత మహిళా క్రికెటర్లు తిరిగి అత్యున్నత స్థాయి క్రికెట్‌లోకి ప్రవేశించేందుకు అవసరమైన సమగ్ర సహకారాన్ని ఈ మార్గదర్శకాలు అందిస్తాయి. ఇందులో భాగంగా ప్రసవానంతరం కోలుకునే ప్రక్రియ, వైద్య పరీక్షలు, శిక్షణతో పాటు మానసిక మద్దతు వంటి అంశాలను దశలవారీగా పర్యవేక్షించనున్నారు. ఈ సందర్భంగా ఐసీసీ చైర్మన్ జై షా మాట్లాడుతూ, "తల్లితనం కోసం క్రీడాకారిణులు తమ కెరీర్‌ను త్యాగం చేయాల్సిన పరిస్థితి రాకూడదు. దేశం తరఫున ఆడటం లేదా అమ్మతనం.. ఈ రెండింటిలో ఒకదాన్నే ఎంచుకోవాలన్న అగత్యం ఉండకూడదు" అని పేర్కొన్నారు. ఈ నూతన మార్గదర్శకాల్లో భాగంగా ప్రతి క్రీడాకారిణికి ఒక ప్రత్యేక కేస్ మేనేజర్, శిక్షణలో వెసులుబాటు, మానసిక ఆరోగ్య నిపుణుల తోడ్పాటు మరియు అవసరమైన చోట్ల శిశు సంరక్షణ సౌకర్యాలను కల్పించాలని ఐసీసీ సిఫార్సు చేసింది. త్వరలోనే రెండో బిడ్డకు జన్మనివ్వనున్న దీపిక, ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతించారు.

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# నేలమ్మా.. నీకు నీళ్లేవమ్మా!

తెలంగాణ అభివృద్ధిలో నీటి వనరులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా వ్యవసాయం, తాగునీరు, పరిశ్రమలు, పట్టణ అవసరాల కోసం భూగర్భ జలాలపై ఆధారపడటం గణనీయంగా పెరిగింది. అయితే విచ్చలవిడిగా బోర్లు వేయడం, వర్షపు నీటి సంరక్షణ లోపించడం, నీటి వృథా వినియోగం, వాతావరణ మార్పుల ప్రభావం వంటి కారణాలతో రాష్ట్రంలో భూగర్భ జలాలు ఆందోళనకరంగా తగ్గిపోతున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వచ్చే ప్రమాదం ఉంది. తెలంగాణలోని అనేక జిల్లాల్లో రైతులు సాగునీటి కోసం ప్రధానంగా బోర్లపైనే ఆధారపడుతున్నారు. వర్షాలు సక్రమంగా లేకపోతే భూగర్భ జలాల వినియోగం మరింత పెరుగుతుంది. ఫలితంగా నీటి మట్టం క్రమంగా దిగజారుతోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వందల అడుగుల లోతులో బోర్లు వేసినా నీరు లభించని పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీనివల్ల రైతులు భారీగా అప్పులు చేసి నష్టపోతున్నారు. పట్టణీకరణ కూడా భూగర్భ జలాల క్షీణతకు ప్రధాన కారణంగా మారింది. హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలు వేగంగా విస్తరిస్తుండటంతో తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయి. మరోవైపు కాంక్రీట్ నిర్మాణాలు పెరగడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం తగ్గుతోంది. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికావడం వల్ల సహజ నీటి నిల్వ వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. ఫలితంగా భూగర్భ జలాల పునరుత్పత్తి తగ్గిపోతోంది. వాతావరణ మార్పులు ఈ సమస్యను మరింత తీవ్రమం చేస్తున్నాయి. అస్థిర వర్షపాతం, దీర్ఘకాలిక ఎండలు, అధిక ఉష్ణోగ్రతలు భూగర్భ జలాల రీఛార్జ్‌ను ప్రభావితం చేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నీటి నాణ్యత కూడా క్షీణించి తాగడానికి, వ్యవసాయానికి అనువుగా లేకపోవడం మరో సవాలుగా మారింది. ఈ పరిస్థితులను అధిగమించాలంటే నీటి వినియోగంలో సమూల మార్పులు అవసరం. ప్రతి ఇంట్లో, ప్రభుత్వ కార్యాలయంలో, విద్యాసంస్థలో, పరిశ్రమలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు తప్పనిసరిగా అమలు చేయాలి. చెరువులు, కుంటలు, వాగులు, కాలువలను పునరుద్ధరించి వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలి. నీటి వనరులను కాపాడే కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ రంగంలో కూడా మార్పులు అత్యవసరం. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించడం ద్వారా నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. అధిక నీరు అవసరమయ్యే పంటల స్థానంలో తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించడం కూడా సమయోచిత నిర్ణయం. రైతులకు శాస్త్రీయ పద్ధతులు, వాతావరణ సూచనలు, నీటి నిర్వహణపై అవగాహన కల్పించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. ప్రభుత్వం భూగర్భ జలాల స్థాయిని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు డిజిటల్ మ్యాపింగ్, శాస్త్రీయ డేటా ఆధారంగా విధానాలు రూపొందించాలి. గ్రామస్థాయిలో నీటి వినియోగ సంఘాలను బలోపేతం చేసి, భూగర్భ జలాల పరిరక్షణలో స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. అలాగే పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు నీటి పునర్వినియోగ వ్యవస్థలను అమలు చేయడం ద్వారా తాజా నీటి వినియోగాన్ని తగ్గించాలి. భూగర్భ జలాలు ఒకసారి తగ్గిపోతే వాటిని తిరిగి పునరుద్ధరించడానికి చాలా సమయం పడుతుంది. అందువల్ల నీటిని అపరిమిత వనరుగా కాకుండా, అత్యంత విలువైన సహజ సంపదగా భావించాలి. నీటి ప్రతి చుక్కను ఆదా చేయడం, వర్షపు నీటిని భద్రపరచడం, శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించడం ద్వారా మాత్రమే భవిష్యత్ తరాలకు నీటి భద్రతను అందించగలం. తెలంగాణ అభివృద్ధి కేవలం భారీ ప్రాజెక్టుల నిర్మాణంతోనే కాదు, ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించడం ద్వారా కూడా సాధ్యమవుతుంది. సుస్థిర నీటి నిర్వహణ, ప్రజల అవగాహన, ప్రభుత్వ సంకల్పం, శాస్త్రీయ ప్రణాళికలు కలిసి నడిస్తేనే భూగర్భ జలాల క్షీణతను అరికట్టి రాష్ట్రానికి జల భద్రతను కల్పించవచ్చు. నీటిని కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడటమే.



## ట్రాఫిక్‌లో గంటలు.. పెరిగే ఖర్చులు
### (ఇదే హైదరాబాదీల వ్యథ)

ఉదయం ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయలుదేరితే కార్యాలయానికి చేరుకోవడానికి అరగంట సరిపోవాల్సిన ప్రయాణం ఇప్పుడు గంటన్నర సమయం పడుతోంది. ఒకప్పుడు ప్రశాంతంగా ఉండే కాలనీలు నేడు భారీ అపార్ట్‌మెంట్లు, వాహనాల రద్దీ, నిరంతర నిర్మాణ పనులతో నిండిపోయాయి. వర్షం పడితే రోడ్లు నీటమునిగిపోతాయి, ఎండాకాలంలో తాగునీటి కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. హైదరాబాద్‌లో నివసించే సాధారణ పౌరుడి రోజువారీ జీవితం ఇలా మారిపోతోంది. నగరం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ప్రజలు సౌకర్యాలను ఆశించినా, అదే అభివృద్ధి కొత్త సమస్యలను కూడా తెస్తోంది. హైదరాబాద్ దేశంలో వేగంగా ఎదుగుతున్న నగరాల్లో ఒకటి. ఐటీ రంగం, ఔషధ పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలు, ఉపాధి అవకాశాలు లక్షలాది మందిని ఆకర్షిస్తున్నాయి. గ్రామాల నుంచి, చిన్న పట్టణాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు ఇక్కడికి వస్తున్నారు. ఈ వలసలతో నగర జనాభా వేగంగా పెరుగుతోంది. అయితే జనాభా పెరుగుదలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు విస్తరించకపోవడం వల్ల నగర జీవితం క్రమంగా ఒత్తిడికి గురవుతోంది. మొదట కనిపించే సమస్య ట్రాఫిక్. కొన్ని కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి గంటల సమయం పట్టడం ఇప్పుడు సాధారణమైంది. ఉద్యోగులు కార్యాలయాలకు చేరుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు సమయానికి కళాశాలలకు చేరుకోలేకపోతున్నారు. అత్యవసర సేవలు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇది కేవలం సమయ నష్టమే కాదు, ఇంధన వినియోగం, వాయు కాలుష్యం, మానసిక ఒత్తిడిని కూడా పెంచుతోంది. ఇళ్ల ధరలు, అద్దెలు మరో పెద్ద సమస్యగా మారాయి. నగరానికి వచ్చే మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో ఇల్లు దొరకడం కష్టమవుతోంది. ఉద్యోగ అవకాశాల కోసం వచ్చిన యువతలో చాలామంది చిన్న గదుల్లో ఎక్కువ మంది కలిసి నివసించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జీవన వ్యయం పెరగడంతో పొదుపు చేయడం కూడా కష్టసాధ్యమవుతోంది. తాగునీరు, మురుగునీటి నిర్వహణ, చెత్త సేకరణ వంటి ప్రాథమిక సేవలపై కూడా ఒత్తిడి పెరుగుతోంది. కొత్త కాలనీలు వేగంగా ఏర్పడుతున్నప్పటికీ వాటికి అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, పాఠశాలలు, ఆసుపత్రులు సమానంగా అభివృద్ధి చెందడం లేదు. వర్షాకాలంలో నీటి నిల్వలు, రోడ్ల దెబ్బతినడం, డ్రైనేజీ సమస్యలు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. పర్యావరణ పరంగా కూడా నగరం సవాళ్లను ఎదుర్కొంటోంది. చెరువులు, ఖాళీ స్థలాలు క్రమంగా నిర్మాణాలకు మారిపోవడం వల్ల వర్షపు నీటి సహజ ప్రవాహం దెబ్బతింటోంది. పచ్చదనం తగ్గడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గాలి నాణ్యత క్షీణించడం ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. పిల్లలు ఆడుకోవడానికి, వృద్ధులు నడవడానికి తగిన బహిరంగ ప్రదేశాలు తగ్గిపోతున్నాయి. ఇవన్నీ చూస్తే అభివృద్ధిని వ్యతిరేకించాలనే ఉద్దేశం కాదు. ఉద్యోగాలు, పెట్టుబడులు, ఆధునిక సౌకర్యాలు నగరానికి అవసరమే. కానీ ప్రణాళిక లేని విస్తరణ వల్ల అభివృద్ధి ఫలితాలు ప్రజలకు పూర్తిగా అందడం లేదు. ఒక నగరం కేవలం ఎత్తైన భవనాలతో గొప్పది కాదు; అక్కడ నివసించే ప్రజలకు సౌకర్యవంతమైన, సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవితం అందించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ పరిస్థితిని మార్చాలంటే ప్రజా రవాణాను మరింత విస్తరించడం, రోడ్ల అభివృద్ధితో పాటు ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడం, సరసమైన గృహ నిర్మాణాన్ని ప్రోత్సహించడం, చెరువులు మరియు హరిత ప్రాంతాలను పరిరక్షించడం, వర్షపు నీటి నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయడం అవసరం.

అలాగే నగర అభివృద్ధి మొత్తం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, పరిసర పట్టణాలు మరియు జిల్లాల్లో కూడా ఉపాధి, విద్య, పరిశ్రమల అవకాశాలను పెంచితే జనాభా ఒత్తిడి కొంత మేర తగ్గే అవకాశం ఉంది. ప్రతి రోజు ట్రాఫిక్‌లో గడిచే గంటలు, పెరుగుతున్న ఖర్చులు, తగ్గుతున్న జీవన నాణ్యత ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. అభివృద్ధి అంటే కేవలం కొత్త భవనాలు కాదు; ప్రజల సమయం, ఆరోగ్యం, పర్యావరణం, జీవన ప్రమాణాలను కాపాడే సమతుల్య ప్రణాళిక కూడా అంతే ముఖ్యమైనది. హైదరాబాద్ వంటి మహానగరాలు భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలంటే, ఇప్పుడు ఎదురవుతున్న ఒత్తిడిని గుర్తించి సమగ్ర పట్టణ ప్రణాళికతో ముందుకు సాగడం కాలానుగుణ అవసరం.



**రామస్వామి చింత**
హైదరాబాద్
(మహబూబ్‌నగర్ వాస్తవ్యుడు)

## బహుజనా.. నీదే అంతిమ పోరాటం!

తెలంగాణ రాష్ట్రంలో ఒక అగ్రకులానికి ఒక సంవత్సరం పాటు రాజకీయ అధికారానికి దూరమైతే మరో తెలంగాణ అస్తిత్వ పోరాటానికి పిలుపునిస్తారు. మరో అగ్రకులానికి ఇంకా ఎక్కువ కాలం అధికారానికి దూరమైతే మరో స్వతంత్ర పోరాటానికి పిలుపునిస్తారు. మరో అగ్రకులానికి అధికారం దూరమైతే తెలుగు ప్రజల ఆత్మగౌరవ పోరాటానికి పిలుపునిస్తారు, మరి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 79 ఏళ్లుగా ఏ అధికారానికి నోచుకోని బహుజన కులాల ప్రజలు , ముఖ్యంగా బీసీ ప్రజలు ఏ ఉద్యమానికి, ఏ పోరాటానికి పిలుపునివ్వాలో, బహుజనులే నిర్ణయించాలి.



తెలంగాణలో మళ్లీ భౌగోళిక తెలంగాణ అస్తిత్వ నినాదం మొలకెత్తుతున్నదా! అంటే అవుననే చెప్పాలి. తెలంగాణ అస్తిత్వ నినాదానికి మళ్లీ ప్రాణం పోస్తున్నారు. తెలంగాణ నినాదం నాలుగు కోట్ల ప్రజల ఆత్మగౌరవ నినాదం, అట్టి తెలంగాణ నినాదం కొందరి రాజకీయ, ఆర్థిక ఆధిపత్య నినాదంగా రూపు దిద్దుకొన్నది. భౌగోళిక తెలంగాణ అస్తిత్వ నినాదం రెండు వైపులా పదునెక్కిన ఉద్యమ కత్తి, అటు బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఉద్యమాలను, అమాంతం మింగి వేసింది, ఇటు సీమాంధ్ర పాలకులైన కమ్మ, రెడ్లను తెలంగాణ పాలన నుంచి తప్పించగలిగింది, తెలంగాణలోని వెలమ,రెడ్లకు పోటీ లేని రాజకీయ అధికారాన్ని అందించగలిగింది , అంతేకాకుండా అధికారం మాకే దక్కుతుందన్న బహుజనులను భ్రమలలో ముంచివేసింది, .సాధించిన తెలంగాణలో తెలంగాణ బహుజనులకు దక్కింది ఏమిటంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో బహుజనుల హక్కుల కోసం నాలుగు ఆధిపత్య కులాలను అడుక్కునే స్థితి నుంచి, సాధించిన తెలంగాణలోని రెండు ఆధిపత్య కులాలను అడుక్కునే స్థితికి వచ్చింది తప్ప సామాజిక,ఆర్థిక, రాజకీయమార్పు ఏమీ లేదు. కావున తెలంగాణలోని సబ్బండ కులాలు ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల నినాదం భౌగోళిక తెలంగాణ అస్తిత్వ నినాదం కాదు, సామాజిక తెలంగాణ నినాదం సబ్బండ కులాలలో ప్రతిధ్వనించాలి .తెలంగాణలోని రెండు పాలక ఆధిపత్య కులాలు, ఆంధ్ర లోని రెండు పాలక ఆధిపత్యా కులాలు కలిసి మళ్లీ తెలంగాణ అస్తిత్వ పోరాట ఆటను మొదలుపెట్టినవి. ఈ యొక్క నాలుగు ఆధిపత్య కులాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ పాలక కులాలే, ప్రస్తుతం రెండు రాష్ట్రాలలో కూడా ఈ నాలుగు ఆధిపత్య కులాలే పాలక కులాలుగా రాజకీయ అధికారాన్ని చెలాయిస్తున్నవి, కావున ఈ యొక్క నాలుగు ఆధిపత్య కులాలు ఒక్కటేనన్న విషయాన్ని తెలంగాణ సబ్బండ కులాలు గ్రహించాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో ఆధిపత్య రెండు కులాల రాజకీయ అధికార ఆటలో భాగంగా,అధిపత్యా పార్టీలు ఇచ్చే ఉద్యమ నినాదాలకు, ఆకర్షితులై మరో మారు మోసపోకూడదు. తెలంగాణ బహుజనులు సొంత రాజకీయ అస్తిత్వ ఉద్యమాలను బలోపేతం చేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

తెలంగాణలోని సబ్బండ కులాల రాజ్యాంగబద్ధహక్కుల అస్తిత్వ నినాదం కావాలి, బహుజనుల రాజకీయ అస్తిత్వ నినాదం కావాలి, తెలంగాణ రాజకీయ,ప్రభుత్వ విధాన నిర్ణయాలలో సబ్బండ కులాల క్రియాశీలక పాత్ర వహించే రాజకీయ నినాదం కావాలి. తెలంగాణ బహుజనులు రాజ్యాంగబద్ధ హక్కుల పోరాటాల నుంచి, ప్రభుత్వ పథకాల లబ్ధి పోరాటాల నుంచి, ఇంకెంతకాలం అడుక్కునే ఉద్యమాల నుంచి రాజకీయ అధికార సాధనే లక్ష్యంగా రాజకీయ ఐక్య ఉద్యమానికి సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది. ఏ ఆధిపత్య నాయకుని నినాదం వెనక ఏ ఆధిపత్య రాజకీయ ప్రయోజనాలు దాగున్నవో, తెలంగాణ ఉద్యమ తొలి,మలి దశలలో తెలంగాణ బహుజనులు పసిగట్ట లేకపోయారు, తెలంగాణలోని రెండు ఆధిపత్య కులాల నాయకుల రాజకీయ ఉద్యమ నినాదాల వెనక, వారిచ్చే బిఫామ్ లకోసం,బీసీలు పరిగెత్తడం మానుకొని, బీసీలు సొంత రాజకీయ అస్తిత్వ అధికార ఉద్యమ నినాదాన్ని అందుకోవాలి, తెలంగాణ ఉద్యమానికి 1200 కు పైగా తెలంగాణ బహుజన బిడ్డలు ప్రాణ త్యాగాలు చేసిన బహుజనుల సామాజిక తెలంగాణ సాధించుకోలేకపోయారు. భౌగోళిక తెలంగాణ అస్తిత్వ నినాదంతో తెలంగాణలోని రెండే రెండు ఉన్నత కులాలు, ఏ త్యాగాలు లేకుండా బహుజనుల పోరాట పునాదుల మీద రాజకీయ అధికారాన్ని సులువుగా దక్కించుకున్నాయి. పదేండ్ల తెలంగాణ పాలనలో, పాలించిన రెండు ఆధిపత్య కులాలు రెడ్లు,వెలమలు దేశంలోనే అత్యంత ధనవంతమైన రాజకీయ నాయకులుగా, వ్యాపారవేత్తలుగా పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. రాష్ట్రము అప్పుల పాలు అయిపోయింది, విద్యా, వైద్యాన్ని కార్పొరేటీకరణ చేసి సామాన్య ప్రజలకు అందని ఎండమావిని చేశారు.

తెలంగాణ సాధించుకొని 12 ఏళ్ల పాలన గడిచిపోయిన, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో 53 ఏళ్ల క్రితం , 60% కలిగిన బీసీ ప్రజలకు విద్యా,ఉద్యోగాలలో కేవలం 25% రిజర్వేషన్ కు 1% రిజర్వేషన్ కూడా పెంచలేకపోయారు. కాని తెలంగాణలో 10% లేని ఉన్నత కులాలలో,కనీసం మూడు శాతం లేని పేదలకు విద్యా ఉద్యోగాలలో 10% రిజర్వేషన్ ఆగమేఘాల మీద అమలు చేశారు. బీసీలకు రాజకీయ అధికారం లేకపోవడం మూలంగానే విద్యా,ఉద్యోగాలలో తగిన రిజర్వేషన్లు సాధించుకోలేకపోయారు. తెలంగాణలో బహుజనుల రాజ్యాధికార ఉద్యమాలు ఊపందుకున్న ఈ సమయంలో , ఎస్సీ, ఎస్టీ ,బీసీ ,మైనార్టీ ప్రజలు సొంత రాజకీయ అస్తిత్వం కోసం సంఘాలుగా, జేఏసీలుగా,విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు,రాజకీయ పార్టీలుగా రూపుదిద్దుకొని బహుముఖంగా కొనసాగుతున్న ఉద్యమాలు మరోమారు తెలంగాణ భౌగోళిక అస్తిత్వ నినాదంలో, అగ్రకుల పార్టీల నాయకుల ప్రలోభాల వరదలో కొట్టుకపోకూడదు, తెలంగాణలోని బహుజనులు రాజకీయ అస్తిత్వ నినాదమే లక్ష్యంగా అగ్రకుల ఆధిపత్య పార్టీలు,కాంగ్రెస్, బి ఆర్ ఎస్, టి ఆర్ ఎస్,బీజేపి, టీడీపీ లకు మూడవ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాల్సిన సమయం ఆసన్నమైనది. మన పక్క రాష్ట్రమైన తమిళనాడులో బహుజన కులాలు రాజకీయ ఐక్యతతో, రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు, రాజకీయ అధికారాన్ని సాధించడంతో తమిళనాడులోని బీసీ ప్రజలకు 1950 నాటికే 25% రిజర్వేషన్ విద్యా,ఉద్యోగాలలోఅమలుచేసుకున్నారు , 1970 నాటికి 25% రిజర్వేషన్ నుంచి 31%నికి రిజర్వేషన్లకు పెంచుకోగలిగారు, 1980 నాటికే బీసీలకు 50% రిజర్వేషన్ అమలు జరుపుకోగలిగారు. మొత్తం రిజర్వేషన్ 69% నికి పెంచుకోగలిగారు. తెలంగాణలోని 90%బహుజన కులాల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు తమిళనాడులోని పెరియార్ రామస్వామి సెల్ఫ్ రెస్పెక్ట్ ఉద్యమాన్ని, ఉత్తరాది సోషలిస్టు ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకొని రాజకీయ ఐక్య పోరాటానికి సన్నద్ధం కావాలి. ఆధిపత్య అగ్రకుల పార్టీలను అడుక్కునే ఉద్యమాలకు ముగింపు పలకాలి. సబ్బండ కులాల రాజకీయ అస్తిత్వ పోరాటమే అల్టిమేట్ పోరాటం కావాలి.



**అక్కల బాబు గౌడ్**
బీసీ చైతన్య వేదిక, రాష్ట్ర సలహా దారు
తెలంగాణ రాష్ట్రం


## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.